### పోషకాహారంతో కూడిన భోజనాన్ని అందించాలి

హైదరాబాద్, తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అంశంపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. పాఠశాల్లలో తప్పనిసరిగా విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పోషకాహారంతో కూడిన భోజనాన్ని అందించాలని ఆదేశించింది. భోజనం వికటించిన విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలకు సంబంధించిన నివేదిక సమర్పించాలంటూ విచారణను ఆరువారాలకు వాయిదా వేసింది. కేసు విచారణ సందర్భంగా భోజనం వికటించిన ఘటనల్లో ప్రభుత్వం రెండు కమిటీలు ఏర్పాటు చేసిందని ధర్మాసనానికి ఏఏజీ వివరణ ఇచ్చారు. ఈ ఘటనల్లో బాధ్యులైన వారిని ఇప్పటికే సస్పెండ్ చేశామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఏజెన్సీలకు చెల్లించే డబ్బులను 40శాతం పెంచినట్లు తెలిపారు. పిటిషర్ తరపున సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. ప్రధానమంతి పోషణ్ పథకం కింద గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలు ఉండాల్సి ఉందని.. కమిటీల పర్యవేక్షణ సరిగా లేపకపోవడం వల్లే భోజనం వికటించే ఘటనలు జరుగుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. కమిటీలు సరిగా పనిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :247 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 07-12-2024 | పేజీలు:4 వెల: 2.00

## కాంగ్రెస్ నిర్బంధిస్తున్నది బీఆర్ఎస్ నేతలను కాదు.. అంబేద్కర్‌ని: కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో స్వేచ్ఛను హరిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలుపుతుంటే అడ్డుకుంటున్నారని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేనట్లుగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నగరం నడిబొడ్డున కేసీఆర్ ఏర్పాటు చేశారు. సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టి గౌరవించుకున్నామని చెప్పారు. తమమీద అక్కసుతో బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి నాడు కనీసం గేట్లు కూడా తెరవకుండా ఆ మహనీయున్ని నిర్బంధించి, అవమానిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం. కాంగ్రెస్ నిర్బంధిస్తున్నది బీఆర్ఎస్ నేతలను కాదని, అంబేద్కర్‌నని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అంబేద్కర్ విగ్రహాన్ని నిర్లక్ష్యం చేయడం వెనుక మీ ఉద్దేశమేంటని ప్రశ్నించారు. దళితబంధు తొలగించి అంబేద్కర్ అభయహస్తం తెస్తామన్నారని, ఇప్పటి వరకు దాని అమలు ఊసేలేదని విమర్శించారు. దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న వారిపై దండిగా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. అంబేద్కర్ విగ్రహం దగ్గర ఎలాంటి ఏర్పాట్లు చేయలేదన్నారు. వందల మంది పోలీసులను పెట్టి తమను నిర్బంధిస్తున్నారని విమర్శించారు. గురుకులాల్లో 48 మంది విద్యార్థులు చనిపోయారన్నారు. గురుకుల విద్యార్థులను తాము ఎవరెస్ట్ శిఖరాలు ఎక్కిస్తే.. మీరు పాడె ఎక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదేనా మీరు అంబేద్కర్‌కు ఇచ్చే నివాళి అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ గురుకుల బాటను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. ఉత్తరప్రదేశ్‌లో రాహుల్ గాంధీని అడ్డుకుంటే సీఎం రేవంత్ రెడ్డి రాజ్యాంగం గురించి మాట్లాడుతాడని, అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలను అడ్డుకోవడం ఎంతవరకు కరెక్టని విమర్శించారు. రాహుల్ గాంధీ చెప్పేదొకటి చేసేదొకటన్నారు. మీ సీఎంకు జ్ఞానోదయం చేయాలంటూ రాహుల్ గాంధీకి సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ అసమర్థతను ఎండగడుతామని చెప్పారు. మర్యాద అనేది ఇచ్చిపుచ్చుకునేదని, కావాలని అడుక్కుంటే రాదని ఎద్దేవా చేశారు. కనీసం నెల రోజులు సమావేశాలు జరగాలన్నారు. సచివాలయం లో రేవంత్ రెడ్డి ప్రతిష్టిస్తున్నది తెలంగాణ తల్లి విగ్రహమా లేదా కాంగ్రెస్ తల్లి విగ్రహమా అని ప్రశ్నించారు. ప్రభుత్వం మారినప్పుడల్లా లోగోలు, నంబర్ ప్లేట్లు మారాలా అని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టారని విమర్శించారు. ఉద్యమ సమయంలో ప్రజలు స్వచ్ఛందంగా తెలంగాణ తల్లి విగ్రహాలు పెట్టుకున్నారని చెప్పారు. నాలుగేండ్ల తర్వాత ఎక్కడ తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలో.. ఎక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం ఉండాలో అక్కడికి పంపిస్తామన్నారు.

## తెలంగాణ తల్లిగా సోనియా గాంధీ విగ్రహం పెట్టట్లేదు కదా..



హైదరాబాద్,విజయోత్సవ సభలు ఎందుకు నిర్వహిస్తున్నారు అంటున్నాడు కేటీఆర్.. పదేళ్లు మూత పడ్డ కాలేజీలు తెరిచామని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేశామన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకి మేము అంబేద్కర్ పేరు పెట్టామన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే అంబేద్కర్ పేరు మార్చారని గుర్తుచేశారు. కేసీఆర్ సీఎంవోలో ఒక్క దళిత ఐఏఎస్ అధికారి ఐనా ఉన్నారా..? అని ప్రశ్నించారు.దళిత బంధు ఎంత మందికి ఇచ్చారు? అని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. ఇందిరా గాంధీ ఇచ్చిన భూములు లాక్కుంది కేసీఆర్ అని కీలక వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేటలో భూములు లాక్కుని.. కలెక్టర్ కార్యాలయం కట్టారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో కేటీఆర,హరీష్ పర్యటన ఉందంటే హౌస్ అరెస్టు చేసే వాళ్ళు అని గుర్తు చేశారు. పోలీసు వ్యవస్థ నీ చిన్నాభిన్నం చేసింది మీరు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరే రెచ్చగొడతారు.. పోలీసులను తిడతారు.. మళ్ళీ రివర్స్ పోలీసులనే తిడతారని మండిపడ్డారు.ప్రధాని మోడీ నేతృత్వంలో దేశం అగ్రగామిగా తీర్చిద్దబడుతోందని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. విదేశీ శక్తులు కుట్రపూరితంగా దేశాన్ని విచ్ఛిన్నం చేయడం, రాజకీయంగా అస్థిర పరిచే ప్రయత్నం చేస్తున్నాయని లక్ష్మణ్ ఫైర్ అయ్యారు. విదేశీ శక్తులు ఫేక్ వార్తలతో, నిరాధార ఆరోపణలతో భారత దేశాన్ని అస్థిర పరిచే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. OCCRP అనే ఏజెన్సీ భారత దేశంపై కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. విదేశీ కుట్రలో కాంగ్రెస్ పావుగా మారి, అవే అంశాలను లేవనెత్తడం, సభను జరక్కుండా చేస్తున్నారని మండిపడ్డారు.మూడేళ్లుగా కార్యక్రమాలను జరక్కుండా అడ్డుకుంటూ ప్రజా ధనాన్ని కాంగ్రెస్ వృధా చేస్తోందని ఆరోపించారు. వార్త రాయడం, వెంటనే కాంగ్రెస్ అందుకోవడం కామన్ అయిపోయిందన్నారు. భారత్ లో అగ్రశేణి పారిశ్రామిక వేత్తలను లక్ష్యం చేసుకుని.. పెట్టుబడి దారులను దెబ్బతీయడం.. నిరాధార ఆరోపణలతో ఉసిగొలుపుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశానికి వ్యతిరేఖంగా వార్తలు వచ్చిన ప్రతిసారి రాహుల్, కాంగ్రెస్ లు ఆందోళనలు చేయడం పరిపాటి అయిపోయిందని అన్నారు.నరేంద్ర మోడీని, బీజేపీని రాజకీయంగా ఎదుర్కోలేక ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. భారత దేశం పట్ల విషం చిమ్ముతున్నారని తెలిపారు. శరీరాలు వేరయినా రాహుల్ ఒకేలా వ్యవహరిస్తున్నారని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. భారత దేశ సార్వభౌమాధికారాన్ని విచ్ఛిన్నం చేసేలా ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో 6 అబద్ధాలు, 66 మోసాలతో ప్రజలను మోసం చేస్తోందన్నారు.ఫేక్ వీడియో సృష్టించి, తెలంగాణ కాంగ్రెస్ ప్రచారం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు.. హైదారాబాద్ లో భారీ ఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేశామని తెలిపారు. రాజ్యసభలో అభిషేక్ మను సింఘ్వీ సీటు వద్ద నోట్ల కట్ట దొరికిందని ప్రచారం చేశారని అన్నారు. కానీ, ఈవీ సీటు వద్ద డబ్బులు దొరికాయని చైర్మన్ స్పష్టం చేశారన్నారు. నోట్ల కట్ట ఎవరిది అనేది విచారణ జరిగితేనే వాస్తవం బయటకు తెలుస్తుందన్నారు. కాంగ్రెస్ ఈ విషయంలో అనవసరంగా రాద్ధాంతం చేస్తుందని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు.

## రాజ్యసభలో నగదు కలకలం..

న్యూఢిల్లీ,పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎగువ సభ లో భారీగా నగదు పట్టుబడింది. ఎంపీ అభిషేక్ సింఘ్వీ సీటు వద్ద నోట్ల కట్ట లభ్యమైనట్లు రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్ తాజాగా వెల్లడించారు.సాధారణ భద్రతా తనిఖీల్లో భాగంగా గురువారం సభ వాయిదా పడిన తర్వాత సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు నిర్వహించినట్లు చైర్మన్ తెలిపారు. ఈ తనిఖీల్లో రూ.500 నోట్లతో ఉన్న నగదు కట్టను గుర్తించినట్లు చెప్పారు. సీటు నంబర్ 222 నుంచి భద్రతా అధికారులు కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ సీటు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎంపీ అభిషేక్ మను సింఘ్వీనికి కేటాయించిందిగా గుర్తించినట్లు చైర్మన్ వెల్లడించారు. ఈ అంశంపై విచారణకు ఆదేశించినట్లు ధన్‌ఖర్ వెల్లడించారు. మరోవైపు తాజా ఘటనపై కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అం శంలో సింఘ్వీ పేరును ప్రస్తావించడంపై మల్లికార్జున ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు.



### రాజ్యసభకు వెళ్లిన ప్రతిసారి ఒకే ఒక్క 500 నోటు పట్టుకెళ్తా: సింఘ్వీ

న్యూఢిల్లీ: రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీ సీటు వద్ద .. గురువారం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో భారీగా నదును గుర్తించారు. ఈ అంశంపై ఇవాళ సభలో దుమారం రేగింది. అయితే ఆ ఘటన పట్ల తెలంగాణ నుంచి ఎంపీగా ఎన్నికైన సింఘ్వీ ఓ వీడియో ద్వారా ప్రకటన చేశారు. రాజ్యసభకు వెళ్తున్న సమయంలో.. ఒకే ఒక్క రూ.500 నోటు పట్టుకెళ్లుతానని సింఘ్వీ తెలిపారు. తన సీటు వద్ద నోట్ల కట్టలు ఉన్న విషయాన్ని మొదటిసారి విన్నట్లు చెప్పారు.గురువారం రోజున మధ్యాహ్నం 12.57 నిమిషాలకు సభలోకి వెళ్లానని, ఆ తర్వాత సరిగ్గా ఒంటి గంటకు సభ నుంచి బయటకు వచ్చినట్లు తెలిపారు. ఆ తర్వాత క్యాంటీన్‌లో అయోధ్య రామిరెడ్డితో కలిసి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు కూర్చున్నట్లు చెప్పారు. సభలో 3 నిమిషాలు, క్యాంటిన్‌లో 30 నిమిషాలు మాత్రమే ఉన్నానని, దీనిపై కూడా రాజకీయం చేస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభలో 222 సీటు నెంబర్‌ను అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించారు. అయితే ఆ సీటు వద్ద నగదు లభించిన అంశంపై విచారణ చేపట్టనున్నట్లు చైర్మెన్ ధనకర్ తెలిపారు.

## మాజీ మంత్రి మల్లారెడ్డికి బిగ్ షాక్!



హైదరాబాద్, మల్లారెడ్డికి హైడ్రా అధికారులు ఊహించని షాక్ ఇచ్చారు. జవహర్ నగర్ యాప్రల్‌లో ఆయన అనుచరుడు అక్రమంగా నిర్మించిన డీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌ను అధికారులు కూల్చివేస్తున్నారు. కూల్చివేత ప్రాంతంలో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి మల్లారెడ్డికి ఉహించని షాక్ తగిలింది. ఆయన అనుచరుడి నిర్మాణంపై హైడ్రా పంజా విసిరింది. మేడ్చల్ జిల్లాలో హైడ్రా దూకుడు పెంచింది. జవహర్ నగర్ యాప్రల్‌లో డీఎన్ఆర్ ఫంక్షన్ హాల్ కూల్చివేతకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 32, 14లో ఫంక్షన్ హాల్ నిర్మాణం జరిగింది. మల్లారెడ్డి అనురుడు నర్సింహారెడ్డికి చెందిన ఫంక్షన్ హాల్‌గా అధికారులు గుర్తించారు. మున్సిపల్, GHMC, హైడ్రా అధికారులు దగ్గరుండి ఆ నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్నారు. ఘటనా స్థలంలో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### గతంలో మల్లారెడ్డితో పాటు...

గతంలో కూడా మల్లారెడ్డికి సంబంధించిన అక్రమ నిర్మాణాలపై హైడ్రాతో పాటు మున్సిపల్ అధికారులు కూల్చివేతలు జరిపారు. పక్కకే ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన మల్లారెడ్డి కాలేజీలోకి రావడానికి రోడ్డు వేశారని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. ఆనాడు దీనిపై మల్లారెడ్డి స్పందిస్తూ.. తనపై కావాలనే కుట్ర చేస్తున్నారని.. తనకు సంబంధించిన ఆస్తులను టార్గెట్ చేస్తూ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపణలు చేశారు. ఇది ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపులో భాగంగా జరిగిన చర్య అని వివరించారు.కాగా గతంలో తన ఆస్తులను కాపాడుకునేందుకు మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరుతారనే ప్రచారం జోరుగా సాగింది. అదే సమయంలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్ ను ఆయన మల్లారెడ్డి కలవడం ఈ పార్టీ మార్పు చర్చలకు మరింత బలం చేకూర్చింది. మరోవైపు మల్లారెడ్డి అల్లుడు, మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి సంబంధించిన కాలేజీలోని భవనాన్ని అధికారులు కూల్చివేశారు. దుండిగల్ లో ఉన్న ఇంజరింగ్ కాలేజీలో ఉన్న ఒక కుంటాను కబ్జా చేసి ఆ భవనాన్ని నిర్మానించారని అధికారులు ఆ భవనాన్ని కూల్చి వేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో లేని అడ్జెస్ట్ మెంట్ మహారాష్ట్రలో కనిపిస్తోంది!



ముంబై:అనుకున్నదే నిజమైంది. అంచనాలకు తగ్గట్లే పరిణామాలు చోటు చేసుకున్నాయి. అధికారం చేతికి వచ్చే అవకాశం కించిత్ ఉన్నా.. అధికారాన్ని తమ చేతిలోకి తీసుకోవటానికి ఏమైనా చేసే అలవాటున్న మోడీషాలు.. అనుకున్నట్లే మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ ను సీఎం చేయటం తెలిసిందే. మహారాష్ట్రకు ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం చేయటంతో పది రోజులుగా కొనసాగుతున్న సస్పెన్స్ కు తెర పడినట్లైంది.గతంలో రెండుసార్లు సీఎంగా వ్యవహరించిన దేవేంద్ర తొలిసారి ఐదేళ్లు.. రెండోసారి ఐదు రోజుల పాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. మూడోసారి సీఎం అయిన ఆయన.. ఈసారి ఎంత కాలం ముఖ్యమంత్రిగా ఉంటారో చూడాలి. ఇక.. సీఎంగా దేవేంద్ర.. డిప్యూటీ సీఎం లుగా ఏక్ నాథ్ షిండే.. అజిత్ పవార్ ప్రమాణస్వీకారం చేశారు.మహారాష్ట్ర రాజకీయాల్నిచూస్తే మాత్రం అడ్జెస్టు మెంట్ కు కేరాఫ్ అడ్రస్ గా అక్కడి నేతలు నిలుస్తారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన దేవేంద్ర ఫడ్నవీస్.. కాలం కలిసి రాని కాలంలో డిప్యూటీ సీఎంగా వ్యవహరించటం.. ఏక్ నాథ షిండే సీఎంగా ఉన్నప్పుడు సర్దుకుపోవటం కనిపిస్తుంది. అనూహ్యంగా ముఖ్యమంత్రి పదవిని సొంతం చేసుకోవటంతో పాటు.. తన పాలనపై ప్రజలను తీర్పు కోరుతూ ఎన్నికల బరిలోకి దిగి.. విజయం సాధించటం ద్వారా ఏక్ నాథ్ షిండే సంచలనాన్ని క్రియేట్ చేశారని చెప్పాలి.అయినప్పటికి బీజేపీ బలాన్ని గుర్తించటం.. అందుకు అనుగుణంగా జరిగే అధికార బదిలీ వేళలో మనసుకు నచ్చని పరిణామాలు చోటు చేసుకుంటున్నప్పటికి సర్దుకొని.. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టటం చూస్తే.. మహారాష్ట్ర రాజకీయ నేతల్లో ఉన్న సర్దుబాటుగుణం తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా కనిపించదు. ఒకసారి ముఖ్యమంత్రి అయితే.. అంతకు తక్కువ పదవులకు ససేమిరా అనటం కనిపిస్తుంది. పరిస్థితులకు తలొగ్గేందుకు తగ్గేదేలే అన్నట్లు ఉంటారే తప్పించి.. కాలానికి అనుగుణంగా అన్న మాటే వినిపించదు. అది సీఎం పదవి అయినా.. చిన్న పదవి అయినా.కానీ.. మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్.. తాజాగా ఏక్ నాథ్ షిండేలను చూస్తే.. సమకాలీన రాజకీయాలకు తగ్గట్లు నేతలు ఎలా ఉండాలో తమ తీరుతో వారిద్దరు చెప్పేస్తున్నట్లుగా అనిపిస్తుంది. మహారాష్ట్రలో కూటమి ప్రభుత్వం ఏర్పాటును చూసిన తర్వాత అర్థమయ్యేది ఒక్కటే.. అధికారాన్ని అందుకునే ఏ అవకాశాన్ని బీజేపీ వదులుకోదని. ఈ సందర్భంగా ఆటలో ఎంతటి శక్తివంతమైన ఆటగాడు ఉన్నా.. తాము చెప్పింది మాత్రమే చేసేలా సదరు ఆటగాడిని సెట్ చేసే విషయంలో మోడీషాలకు తిరుగు ఉండదని.

### నేను అడిగితేనే శిందే అంగీకరించారు: ఫడణవీస్

ముంబయి: భాజపా సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస నేతృత్వంలో మహారాష్ట్ర లో మహాయుతి ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆయన ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తాను అడిగితేనే ఉప ముఖ్యమంత్రిగా ఉండేందుకు మాజీ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే అంగీకరించారని ఆయన పేర్కొన్నారు. 'ఎన్నికల్లో విజయం తర్వాత జరిగిన మహాయుతి తొలి సమావేశంలో సీఎం అభ్యర్థి భాజపా నుంచి ఉండేందుకు ఏక్‌నాథ్ శిందే అంగీకరించారు.అయితే,శిందే ప్రభుత్వంలో భాగం కాకూడదని, మహాయుతి కూటమి సజావుగా సాగేందుకు నేతృత్వం వహిస్తే చాలని శివసేనలోని ఓ వర్గం భావించింది. తమ పార్టీ నుంచి సీఎం కావాలని శివసేన నాయకులు కోరుకున్నారు. వ్యక్తిగతంగా శిందేతో నాకు మ ంచి సంబంధాలు ఉన్నాయి. ప్రమాణస్వీకారోత్సవానికి రెండు రోజుల ముందే నేను శిందేతో భేటీ అయ్యాను. అప్పుడే ఆయన ఉప ముఖ్యమంత్రిగా ఉండేందుకు అంగీకరించారు' అని ఫడణవీస్ పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 230 స్థానాల్లో మహాయుతి కూటమి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే సీఎం ఎవరనే అంశంపై కూటమి నేతల మధ్య తీవ్రమైన చర్చలు జరిగాయి.

## విద్యకు ప్రాధాన్యం ఇచ్చిన మహానేత అంబేద్కర్



హైదరాబాద్ : విద్యతో ఇబ్బందులను అధిగమించవచ్చనే విషయాన్ని బీఆర్ అంబేద్కర్ పూర్తిగా నమ్మారని తెలిపారు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. అందుకే దేశం వ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాను ఆయన స్థాపించారని గుర్తు చేశారు. సమసమాజ స్థాపనకు యువత మేధస్సు ఉపయోగపడాలనేది తన ఆకాంక్ష అని అన్నారు. కూకట్‌పల్లి జేఎన్‌టీయూ లో నేడు జరిగిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.. ముందుగా ఆయన అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం సకల సమస్యలకు పరిష్కారమని అన్నారు. అసమానతలు లేకుండా ఉంటే భారత్ ఎన్నడో ప్రపంచాన్ని జయించేదని అన్నారు. రాజ్యాంగం ఒక్కటే సకల సమస్యలకు పరిష్కారం చూపుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే సంవిధాన్ సమ్మాన్ బచావ్ సమ్మేళన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. సమాజ పరివర్తన, సమస్యలకు పరిష్కాం చూపేది రాజ్యాంగమేనని అన్నారు. ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని చదవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. భారతదేశంలో మానవ వనరులు అద్భుతంగా ఉన్నాయని ప్రపంచాన్ని జయించే శక్తి, మేధస్సు మనలో ఉందని తెలిపారు. జాతుల మధ్య పోరాటాలతోనే ఆ శక్తి మొత్తం నిర్వీర్యం అవుతోందని భట్టి అభిప్రాయపడ్డారు.

## అరెస్టులతో భయపడా : పాడి కౌశిక్‌రెడ్డి..



హైదరాబాద్, డిసెంబర్ 6: ఇలాంటి అరెస్టులకు భయపడేది లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాని చెప్పారు. ఊపిరి ఉన్నంత వరకు హుజూరాబాద్ ప్రజల కోసం ప్రశ్నిస్తానన్నారు. ప్రజల ఇచ్చిన ఆరు గ్యారంటీల కోసం ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అర్ధరాత్రి జడ్జి బెయిల్ మంజూరు చేసిన అనంతరం అయన మీడియాతో మాట్లాడారు. గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో కౌశిక్‌రెడ్డిని కొండాపూర్‌లోని తన నివాసంలో జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే నోటీసులు ఇచ్చి వదిలిపెట్టేందుకు అవకాశాలున్నా రాత్రి పొద్దుపోయే దాకా పీఎస్‌లోనే నిర్బంధించారు.

## సంపాదకీయం

శనివారం 07-12-2024

# పండంటి ఆరోగ్యానికి ఏఐ సేవలు

ఏ దేశంలోనైనా ఆరోగ్య సంరక్షణ అనేది అత్యవసర సేవల్లో కీలకమైనది. వైద్యుల కొరత తీవ్రంగా ఉన్న భారతదేశంలో 140 కోట్ల ప్రజానీకానికి నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం పెద్ద సవాలే. ఓవైపు వైద్య సిబ్బందిపై శక్తికి మించిన భారం పడుతుంటే, మరోవైపు వైద్యం కోసం రోగులు దీర్ఘకాలం నిరీక్షించాల్సి వస్తోంది.ఏ దేశంలోనైనా ఆరోగ్య సంరక్షణ అనేది అత్యవసర సేవల్లో కీలకమైనది. వైద్యుల కొరత తీవ్రంగా ఉన్న భారతదేశంలో 140 కోట్ల ప్రజానీకానికి నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం పెద్ద సవాలే. ఓవైపు వైద్య సిబ్బందిపై శక్తికి మించిన భారం పడుతుంటే, మరోవైపు వైద్యం కోసం రోగులు దీర్ఘకాలం నిరీక్షించాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించడానికి కృత్రిమ మేధ ఎంతగానో అక్కరకొస్తుంది.ఆరోగ్య సంరక్షణను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం, సమర్థంగా చికిత్స అందించడం, రోగుల ఆదరణను చూరగొనడంలో కృత్రిమ మేధ (ఏఐ) సత్తా చాటుకుంటోంది. జనరేటివ్ ప్రీ ట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్స్(జీపీటీ), లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్(ఎల్ఎల్ఎం) అనే పునాదిపై ఏఐ పనిచేస్తుంది. దీని సాయంతో పనిచేసే తెలివైన చాట్ బాట్స్, వర్చువల్ అసిస్టెంట్స్ ఇప్పటికే ఆరోగ్య సేవలు అందిస్తున్నాయి. ఎల్ఎల్ఎం అపార సమాచారాన్ని చదివి అవగాహన చేసుకుని మానవుల్లా స్పందిస్తాయి. మనకు అర్థమయ్యే విధంగా సమాచారాన్ని అందించే ఎల్ఎల్ఎంను జీపీటీ అంటారు. మనతో సంభాషించే ఏఐ చాట్ బాట్స్‌కు ఎల్ఎల్ఎం మెదడులా పనిచేస్తుంది. రోగులతో వివిధ భాషల్లో సంభాషించగల సామర్థ్యాన్ని ఈ చాట్ బాట్స్‌కు అందించవచ్చు. జటిలమైన సమాచారాన్ని రోగులకు అర్థమయ్యేలా చెప్పడానికీ, చికిత్సకు సంబంధించి సలహాలు ఇవ్వడానికీ ఏఐ అమోఘంగా తోడ్పడుతుంది. ఎన్నో భాషలు మాట్లాడే సువిశాల భారతదేశంలో అసంఖ్యాక ప్రజానీకానికి ఆరోగ్య సలహా సంప్రతింపులు అందించడానికి ఏఐ సమర్థ సాధనమవుతుంది. ఏఐజీ ఆస్పత్రి సరిగ్గా ఇలాంటి ఏఐ ఆధారిత వర్చువల్ అసిస్టెంట్‌ను రూపొందించింది. దానికి 'మెడికల్ ఇన్ఫర్మేషన్ రోబో అసిస్టెంట్ (మిరా)' అని నామకరణం చేసింది.

స్థానిక భాషల్లో...

మిరా రోగులకూ, వైద్యులకూ చక్కని సహాయకారి కాగలదు. ఆరోగ్యానికి సంబంధించిన సాధారణ ప్రశ్నలకు మిరా సూటిగా సరళంగా సమాధానాలు ఇవ్వగలదు. ఉదాహరణకు మధుమేహ లక్షణాలేంటి, ఎండోస్కోపీకి ఎలా సిద్ధపడాలి అనే ప్రశ్నలకు సరైన సమాధానాలిస్తుంది. ఏ సమస్య వచ్చినా ఆస్పత్రికి పరుగున రావడం, సుదీర్ఘ ఫోన్ కాల్స్ చేయడం వంటి వాటిని మిరా నివారించగలుగుతుంది. వివిధ భాషలు మాట్లాడే రోగులకు ఆయా భాషల్లోనే సమాధానాలు చెప్పగలుగుతుంది. భారతదేశంలో ఎన్నో భాషలు ఉన్నప్పటికీ, వైద్య సమాచారం ప్రధానంగా ఆంగ్లంలోనే లభించడం పెద్ద లోపం. దీన్ని అధిగమించడానికి మిరా గొప్పగా తోడ్పడుతోంది. జటిలమైన వైద్య పరిభాషను కూడా స్వదేశీ భాషల్లో విడమర్చిచెప్పడం మిరా విశిష్టత.ఏఐజీ ఆస్పత్రి రూపొందించిన మిరా– రోగులతో పాటు మితిమీరిన పనిభారంతో సతమతమవుతున్న వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందికీ మంచి సాయం చేయగలదు. రోగులు, వారి కుటుంబ సభ్యుల సందేహాలను మిరా నివృత్తి చేయడం ద్వారా... వైద్యులకు అత్యవసరమైన, ముఖ్యమైన సమస్యల పరిష్కారంపై సర్వశక్తులూ కేంద్రీకరించే వెసులుబాటు దక్కుతుంది. వైద్యులకు అధునాతన వైద్య సమాచారాన్ని అందిస్తుంది. మందుల సమాచారం, చికిత్సా పద్ధతులు, వైద్యపరమైన మార్గదర్శకాలను చిటికెలో అందుబాటులోకి తెస్తుంది. వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లకు వ్యాధులు, వాటి చికిత్సకు సంబంధించిన సమాచారాన్ని అందించి, వైద్య రీతులను బోధించే ఇంటరాక్టివ్ సాధనంగా మిరా నిలవగలదు. రోజులో 24 గంటలూ నిర్విరామంగా సేవలు అందించే సత్తా దీనికుంది. ఎప్పుడంటే అప్పుడు సహాయానికి సిద్ధం అంటుంది. మిరా వంటి ఏఐ సాధనాల వల్ల ఉపయోగాలు అనంతం. రోగులు ఆస్పత్రికి వచ్చేముందే తాము ఏయే పత్రాలు తీసుకురావాలి, ఏయే పరీక్షలు చేయించుకోవాలి అనేది వీటి ద్వారా తెలుసుకోవచ్చు. దానివల్ల ఎంతో సమయం ఆదా అవుతుంది. సందిగ్ధత తొలగుతుంది. చికిత్స పూర్తయిన తరవాత రోగి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందులు, ఆహారం గురించీ ఏఐ సాధనాలు వివరిస్తాయి. ఏలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలో కూడా సూచిస్తాయి. డెంగీ, క్యాన్సర్ వంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించి, జాగ్రత్తలు సూచించగలవు. వైద్యుల కొరత తీవ్రంగా ఉండే గ్రామాల్లోని రోగులకు సాధారణ వైద్య సలహాలు ఇస్తాయి. రోగి పరిస్థితిని బట్టి సమీప ఆస్పత్రికి వెళ్లాల్సిందిగా అప్రమత్తం చేయగలవు.

కచ్చితత్వం కోసం కృషి

మిరా వంటి ఏఐ సాధనాలతో ఉపయోగాలతోపాటు కొన్ని సవాళ్లు, సమస్యలు ఎదురయ్యే అవకాశముంది. ఈ సాధనాల కోసం భారీగా డబ్బు వెచ్చించాల్సి వస్తుంది. అంతటి స్తోమత చిన్నచిన్న ఆస్పత్రులకు ఉండకపోవచ్చు. ఏఐ సాధనాల వినియోగంపై వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికీ, రోగులకు అవగాహన కల్పించడానికీ, వారి నమ్మకం చూరగొనడానికీ కొంత సమయం పడుతుంది. రోగుల రికార్డులను భద్రంగా ఉంచడానికి జాగ్రత్త తీసుకోవాలి. ఏఐ సాధనాలవల్ల ఆ రికార్డులు బయటకు పొక్కకుండా చూడాలి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ, ప్రైవేటు సహకారంతో ఈ సమస్యలను అధిగమించవచ్చు. ప్రస్తుతానికి మిరా ప్రయోగ దశలోనే ఉంది. దాన్ని ఇంకా ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. మిరాకు మరింత కచ్చితత్వం, విశ్వసనీయత తీసుకురావడానికి కృషి జరుగుతోంది. రోగుల సమాచార భద్రతకు చర్యలు తీసుకుంటున్నాం. అంతా సవ్యంగా ఉందని నిర్ధారించుకున్నాకే మిరాను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురాగలం. మిరా వైద్యచికిత్సను అందరికీ అందుబాటులోకి తెస్తుంది. భాషాపరమైన అడ్డంకులనూ, వైద్యులపై పనిభారాన్నీ, చికిత్సా సౌకర్యాల కొరతను అధిగమించడానికి సాయపడుతుంది. ఇలాంటి ఏఐ సాధనాలు వైద్యులు, నర్సుల స్థానాన్ని భర్తీ చేయవు. కానీ, వారికి కుడి భుజంలా పనిచేస్తాయి. వారి సామర్థ్యాన్ని ఇనుమడింపజేస్తాయి. మరింత నాణ్యమైన సేవలు అందించడానికి తోడ్పడతాయి. రోగులకు వేగంగా సేవలు అందించి ఆరోగ్యకరమైన భావి భారత నిర్మాణానికి సహకరిస్తాయి.

# కాంగ్రెస్ పదే పదే ఎందుకు విఫలమవుతోంది?

న్యూఢిల్లీ,సార్వత్రిక ఎన్నికల్లో వంద స్థానాలు గెలిచి ఉత్తరాధిలో కొద్దిగా పుంజుకున్నట్టు కనిపించిన కాంగ్రెస్ కు మళ్లీ దెబ్బ మీద దెబ్బ. ఎంత బలంగా జనంలోకి వెళ్లినా బీజేపీ ముందు నిలువ లేకపోతోంది. ఆ పార్టీ విజయ పరంపరను అడ్డుకోవటంలో ఘోరంగా విఫలమవుతోంది. గెలిచిన రాష్టాల్లోన్రే బీజేపీ మళ్లీ మళ్లీ గెలుస్తోంది. పైగా, గతంలో కంటే ఎక్కువ సీట్లు, ఓట్లు సాధిస్తోంది? ఇటీవలి హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఇందుకు మంచి ఉదాహరణలు. అంతకు ముందు మధ్యప్రదేశ్. కాంగ్రెస్ గెలుస్తుంది అనుకున్న చోటల్లా ఓటమి పాలవుతోంది. ఎక్కడ పొరపాటు జరుగుతోంది? కాంగ్రెస్ ఎప్పటికైనా అధికారం చేజిక్కించుకోగలదా? కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తాజా సమావేశంలో పాల్గొన్నఅందరిలోనూ ఈ ప్రశ్నలే. వారు సాధారణ నేతలు కాదు. ఎంతో అనుభవం ఉన్నవారు. అయినా ఈ వరుస ఓటములకు కారణాలేమిటో వారు నిర్దిష్టంగా చెప్పలేకపోయారు. నాలుగున్నర గంటల పాటు జరిగిన చర్చను చివరకు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై మరో కమిటీని వేయాలని నిర్ణయించి ముగించారు. ఇది చాలా రొటీన్ గా జరిగేదే. గతంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హర్యానా ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అంతర్గత కమిటీలను నియమించింది. ఈ కమిటీల వల్ల ఏమి జరుగుతుందుతో ఎవరికీ తెలియదు. మరోవైపు, బీజేపీ ఎప్పటికప్పుడు కొత్త ఎత్తుగడలతో ఎన్నికలు సదా సిద్ధంగా ఉంటుంది. మహారాష్ట్ర ప్రయోగాన్ని దేశమంతటా అమలు చేసేందుకు బీజేపీ ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. కానీ కాంగ్రెస్ పార్టీలో ఈ కసి ఏ కోశానా కని పించదు. కనీసం ఒక ఏడాది ముందైనా మనం ఎన్నికలకు సంసిద్ధం కావాలని అర్థం అవుతోందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జులన ఖర్గే వర్కింగ్ కమిటీ సమావేశంలో అన్నారు. మోడీ ఒక ఎన్నికల ఫలితాలు రాకముందే మరో ఎన్నికలకు సిద్ధమయి ఉంటారని కాంగ్రెస్ నేతలు ఇంకా గ్రహించలేదనే విషయం ఖర్గే మాటల ద్వారా స్పష్టమవుతోంది. భారతీయ జనతా పార్టీ వద్ద ఎప్పుడూ ఒకటికి మించిన వ్యూహాలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. ప్రత్యర్థి పార్టీలను బలహీన పరిచేందుకు వ్యూహాలను నిరంతరం అమలు చేస్తూనే ఉంటుంది. వివిధ రూపాలలో ఉన్నఆ పార్టీ క్యాడర్ నిరంతరం ప్రజలను తమకు అనుకూలంగా తిప్పుకునే పనిలో నిమగ్నమై ఉంటాయి. వీటన్నిటికి తోడు ప్రధాని మోడీ కేంద్రంగా అభివృద్ధి మంత్రాన్ని వివిధ స్థాయిల్లో ఢంకా బజాయి స్తూనే ఉంటాయి ఆ పార్టీ శ్రేణులు. అన్నిటికి మించి పార్టీకి పుష్కలంగా నిధులున్నాయి. వెరసి, గెలిచిన రాష్టాల్లో్ర మళ్లీ గెలిచేందుకు, ప్రతిపక్షంగా మారిన రాష్ట్రంలో మళ్లీ అధికారం చేజిక్కిం చుకునేందుకు బీజేపీ కసిగా పనిచేస్తుంది. ఇక. కాంగ్రెస్ పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. ఆ పార్టీ వరుసగా ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయి కాని వరుసగా అధికారంలోకి వచ్చిన సందర్భాలు ఇటీవలి కాలంలో లేవు. 2014లో కాంగ్రెస్ హర్యానలో గెలిచినప్పటికీ 2019 నుంచి ఓడిపోతూనే వస్తోంది. పంజాబ్‌లో అయిదేళ్లు పాలించి ఆప్‌కు అధికారాన్ని అప్పగించింది. అదే బీజేపీ గుజరాత్, హర్యానా వరుసగా మూడుసార్లు గెలిస్తే, అస్సాం, త్రిపుర, గోవా, మణిపూర్, యూపీ, ఉత్తరాఖండ్, మేఘాలయ, నాగాలాండ్, సిక్కింలలో వరుసగా రెండుసార్లు గెలిచింది. కాంగ్రెస్‌తో పోలిస్తే తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, జేఎంఎం వంటి



ప్రాంతీయ పార్టీలు వరుస విజయాలు సాధించాయి. కాంగ్రెస్‌లో ఆ కసి ఎందుకు కనపడడం లేదు?అదానీ, కులగణన, రాజ్యాంగాన్ని కాలరాయడం ప్రజా సమస్యలు కావా? వాటికి అనుకూలంగా ప్రజలు ఎందుకు స్పందించడం లేదు? అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ప్రశ్నించినట్లు తెలిసింది. అదానీని విమర్శించినంత మాత్రాన కాంగ్రెస్ కార్పొరేటీకరణను వ్యతిరేకిస్తుందని ఎవరైనా అనుకుంటారా? అదానీపై మిత్రపక్షాలలో కూడా ఏకాభిప్రాయం లేదు. కులగణన గురించి ప్రస్తావించినంత మాత్రాన సామాజిక న్యాయం కోసమే కాంగ్రెస్ పుట్టిందని జనం అనుకుంటారా? బీజేపీ దశాబ్దాలుగా ఒకే సిద్ధాంతం ఆధారంగా పనిచేస్తే కాంగ్రెస్ ఒక నిర్దిష్ట సిద్ధాంతాన్ని దీర్ఘకాలం కొనసాగించలేకపోతోంది. ఓటమి పాలైనపుడు ఎక్కడ లోపం జరిగిందో తెలుసుకుని తగిన చర్యలు తీసుకునివుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. సంస్థాగతంగా చేయాల్సిన పెను మార్పులను సూచిం చేందుకు గతంలో ఆంటోనీ, అహ్మద్ పటేల్ లాంటి వారితో కమిటీలు వేసినా వారి సూచనలు అమలు అయిన దాఖలాలు లేవు. ముఠాతత్వం, కుమ్ములాటలు కూడా ఒక కారణమని చెప్పిన ఖర్గే పార్టీ అధ్యక్ష స్థానంలో ఉండి వాటిని ఎందుకు అరికట్టలేకపోతున్నారో ఎవరు చెప్పగలరు? కాంగ్రెస్‌లో యథాతథ పరిస్థితిని ఆకాంక్షించేవారే ఎక్కువ ఉండడం, సమూలంగా మార్పులు చేసేందుకు పార్టీ అగ్రనేతలు సాహసించకపోవడం వల్ల ఆ పార్టీ బీజేపీని ఢీకొనే శక్తిగా ఆవిర్భవించ గలదన్న నమ్మకాలు కలగడం లేదు. అందుకు ప్రధాన కారణం వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న పార్టీలో తుక్కూ, తుప్పూ బాగా పేరుకుపోయి ఉండడం. అంతే కాదు, ఎన్నికలు లేనప్పుడు కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం చాలా స్తబ్దంగా ఉంటుంది. ఆ సమయాన్ని నిర్మాణాత్మకంగా ఉపయోగించుకున్న దాఖలాలు లేవు. ఎన్నికలప్పుడే కాంగ్రెస్ నేతలు జనంలో కనపడతారు. ఎన్నికల పక్రియలో అవకతవకలు జరిగాయన్న విషయంలో కాంగ్రెస్ చూపే అధారాలను ప్రజలు విశ్వసించేలా చేయనంతవరకూ ఈవీఎంలపై ఎన్ని ఆరోపణలు చేసినా ఫలితం ఉండదు. పోలింగ్ బూత్ స్థాయి ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలి అని ఖర్గే ఆలస్యంగానైనా గ్రహించారు. బీజేపీ సిద్ధాంతం మంచిదా కాదా అన్నది వేరే చర్చ. ఆ పార్టీ తన సొంత ఓటు బ్యాంకు నిర్మించుకుంటూ, పెంచుకుంటూ పోతోంది. కాంగ్రెస్ పూర్తిగా బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకుపై ఆధారపడుతోంది. తన ఓటు బ్యాంకును తానే స్వంతంగా నిర్మించుకోనంతవరకూ కాంగ్రెస్ భవిష్యత్తు అగమ్యగోచరమే.

# మోడీ-ఆర్ఎస్ఎస్ బంధంపై 'మహా' గెలుపు ప్రభావం



మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తీర్పు ప్రధాని, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నాయకత్వం మధ్య తరచు నెలకొనే ఇబ్బందికర సంబంధాల్లో మరొక నిర్ణయాత్మక మార్పు తీసుకువచ్చినట్లు కనిపిస్తోంది. అయితే, గత దశాబ్దంలో వలె కాకుండా, ఈ దఫా ఆ ఒత్తిడి దశ మోడీకి అనుకూలంగా తేలికపడింది. ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకోవాలంటే, చరిత్రలోకి అంటే, మోడీ 2001 అక్టోబర్‌లో గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదటిసారి ప్రభుత్వ బాధ్యతలు చేపట్టిన కాలానికి వెళ్లడం అవసరం. మోడీకి పూర్వం, భారతీయ జనతా పార్టీ (బిజెపి) నాయకుల్లో ఎవరో కొద్ది మంది మాత్రమే ప్రభుత్వ బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌లుగా ఉన్నారుబీ అటువంటి కొద్ది మంది ప్రచారక్‌లలో అటల్ బిహారి వాజ్‌పేయి, లాల్ కృష్ణ అద్వానీ, సుందర్ లాల్ పట్వా, రాజ్‌నాథ్ సింగ్ ఉన్నారు. 1990 దశకం ద్వితీయార్థంలో యునైటెడ్ స్టేట్స్‌ను సందర్శించినప్పుడు వాజ్‌పేయి 'ఒకసారి ప్రచారక్ అయితే ఎల్లప్పుడూ ప్రచారక్' అని గొప్పగా ప్రకటించారు. అయినప్పటికీ, ఆయనకు ఆర్ఎస్ఎస్ నాయకత్వంతో అంతగా సామరస్య పూర్వక సంబంధం లేదు. అదే విధంగా, మోడీ తన సాదా కుటుంబ నేపథ్యం గురించి, సాధారణ ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ఉన్న రోజుల గురించి తరచు ప్రస్తావిస్తుండేవారు, పరిపాలన ప్రాథమిక సూత్రాలు నేర్చుకోవడానికి తనకు వీలు కల్పిస్తూ సంస్థతో ప్రగాఢ అనుబంధం గురించి కూడా ఆయన బాహాటంగా చెబుతుండేవారు. ఆయన జీవిత కథ కోసం నేను పరిశోధన చేస్తున్నప్పుడు, తాను 'సంస్థను నిర్వహించే మౌలిక నైపుణ్యాన్ని సంఘ్ నుంచి నేర్చుకున్నట్లు', 'ఒక బృందాన్ని గుర్తించడం, దానిని నిర్మించడం, పని జరిపేలా బృందాన్ని సిద్ధం చేయడం వంటి వాటికి అంగబలాన్ని పూర్తిగా వినియోగించుకోవడానికి' శిక్షణ పొందిన కారణంగానే పరిపాలనకు చెందిన ఎత్తులు గ్రహించానని మోడీ నాతో చెప్పారు. అయితే, నేర్చుకున్న అన్ని పాఠాలను మరీ ముఖ్యంగా వ్యక్తికి తక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం, సంస్థ, పార్టీ లేదా ప్రభుత్వాన్ని ప్రోత్సహించడం అనేవి అనుసరించాలని మోడీ కోరుకోలేదు.కేశూభాయ్ పటేల్‌ను రాజీనామా చేయవలసిందిగా పార్టీ నాయకత్వం ఆదేశించిన తరువాత మోడీ సిఎం పదవిని అధిష్ఠించారు. పరివార్‌లో మామూలుగా జరిగేవి ఏవో ఆయనకు తెలుసు తుదకు వాజ్‌పేయి కూడా 1998లో తాను కోరుకున్న విధంగా చేయలేకపోయారు, జశ్వంత్ సింగ్, ప్రమోద్ మహాజన్ పోటీచేసిన లోక్‌సభ నియోజక వర్గాల్లో ఓడిపోయినందున వారిని తొలి ఎన్‌డిఎ ప్రభుత్వంలో ఆయన చేర్చుకోలేకపోయారు. పరాజిత నేతలను మంత్రులుగా నియమించే ఆనవాయితీని నెలకొల్పాలని ఆర్ఎస్ఎస్ నాయకత్వం ఆకాంక్షించలేదు. ఈ సందేశాన్ని లోపాయికారీగా పంపలేదు, కానీ బాహాటంగానే పంపారు. ఆర్ఎస్ఎస్ సీనియర్ కార్యనిర్వాహకుడు, ఆ తరువాత సర్‌సంఘ్‌చాలక్ అయిన కెఎస్ సుదర్శన్ ఆర్థిక శాఖ మంత్రిగా యశ్వంత్ సిన్హాను తీసుకుని, మరునాటి ఉదయం మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయవలసిఉన్న నేతల జాబితాలో నుంచి పరాజితులు ఇద్దరికీ ఉద్వాసన పలకాలనే ఆదేశంతో వాజ్‌పేయి వద్దకు వెళ్లారు. ఈ నేపథ్యంలో, అహ్మదాబాద్‌లోని ఆర్ఎస్ఎస్ సీనియర్ కార్యనిర్వాహకులు మోడీ తమ వద్దకు వచ్చి, పరిపాలన, విధానాలపై తమను సంప్రదిస్తారని ఆశించారు.అయితే, ఆయన రాష్ట్రాన్ని ఏకపక్షంగా నడిపారు, కాలక్రమేణా ఆయన అన్ని విధాన నిర్ణాయక అధికారాలను ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఒ)లో కేంద్రీకృతం చేశారు. ఆయన ప్రధాని అయిన తరువాత అటువంటి పద్ధతినే అనుసరించారు. అయితే, ఆదిలో కేంద్ర మంత్రులను సలహా సంప్రదింపుల సమావేశాలకు ఆర్ఎస్ఎస్ 'ఆహ్వానించింది'. కాలక్రమేణా, ఆయన ప్రభుత్వాన్ని 'మోడీ సర్కార్'గా ప్రస్తావించసాగారు. ఆ పదబంధానికి ఆయన జూన్ 4 తరువాత స్వస్తి పలికి, దానిని 'ఎన్‌డిఎ సర్కార్'గా పేర్కొనసాగారు. వరుసగా మూడవ విడత ఎన్నికల్లో మెజారిటీ సాధించడంలో బిజెపి వైఫల్యంలో ఆర్ఎస్ఎస్ ప్రధాన పాత్ర పోషించింది. 2014 తరువాత దశాబ్ది కాలంలో అధిక భాగం ఆర్ఎస్ఎస్ అధినాయకత్వం మోడీ పని సరళి పట్ల అసౌకర్యాన్ని భావించింది, కానీ, దానిని బహిర్గతం చేయలేదు. అందుకు కారణం ఆయన సైద్ధాంతికంగా నిబద్ధుడై, హిందుత్వ అజెండాను కూడా అమలు పరచడమే.ఎన్నికలు, రాజకీయాలను పూర్తిగా వ్యక్తిగతం చేయడంలో, 'మోడీ కీ గ్యారంటీ' నినాదం మరీ శ్రుతి మించి పనిచేసింది. అభ్యర్థి ఎంపికల్లో సూచనలను ఏమాత్రం పట్టించుకోకపోవడం ఎన్నికల ప్రచార సమయం లో సంఘ్ దూరంగా ఉండేందుకు ప్రధానంగా కారణమైంది. అయినప్పటికీ, ఎన్‌డిఎ బలం 400o కావాలనే తన లక్ష్యం నెరవేరుతుందని ఆయన అతి నమ్మకంతో ఉండిపోయారు. ఆర్ఎస్ఎస్‌కు మరింత ఆగ్రహం తెప్పించిన ఒక పని ఏమిటంటే, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా బహుశా మోడీ, అమిత్ షా ఆమోద ముద్రతో ఆర్ఎస్ఎస్ అవసరం లేనంతా పార్టీ వృద్ధి చెందిందని, అది ఇప్పుడు 'సమర్థమైనది' అని ప్రకటించడం.జూన్ 4, నవంబర్ 23 తీర్పుల మధ్య పరిస్థితి ఆర్ఎస్ఎస్ ఎన్నికల ప్రభావ సామర్థ్యాన్ని ఉద్ఘాటిస్తోంది. మహారాష్ట్రలోను, అందకుముందు హర్యానాలోను బిజెపి, మిత్రపక్షాల సంఖ్యాబలంలో అద్భుత మార్పు విషయంలో మాత్రమే కాకుండా, మోడీ ఉధృతంగా ప్రచారం చేయకుండానే ఆ ఫలితాలు సాధించడాన్ని కూడా అది సూచిస్తోంది. కీలకంగా, మథురలో ఆర్ఎస్ఎస్ విధాన నిర్ణాయక విభాగం ముఖ్యమైన సమావేశం అనంతరం అక్టోబర్ ద్వితీయార్థంలో ఆర్ఎస్ఎస్ సర్‌కార్యవాహ్ దత్తాత్రేయ హొసబలే ఉద్ఘాటనలు మోడీ ఆర్ఎస్ఎస్ అనుబంధంలో మార్పునకు సూచిక అయింది. మోడీ ఆర్ఎస్ఎస్ మధ్య సంబంధంలో పరుష దశ స్థాయి సడలిందని ఆయన ప్రకటన సూచించింది, ఆ దశల సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ తీవ్రస్థాయిలో అనేక దూషణలు చేశారు. ఆయన పేరుపెట్టి ఎవరినీ ప్రస్తావించకపోయినా ఎవరిని ఉద్దేశించిందీ తేలికగా గ్రహించుకోవచ్చు. లోక్‌సభ ఎన్నికల అనంతరం నడ్డా కేరళ పాలక్కాడ్‌లో తొలి ఆర్ఎస్ఎస్ సమన్వయ సమావేశానికి హాజరైనప్పుడు బిజెపికి ఆర్ఎస్ఎస్ 'అవసరం' ఇంకా ఉన్నదనే సంకేతం మొదటిసారి వచ్చింది. నడ్డా ప్రకటనను ఆర్ఎస్ఎస్ గ్రహించిందని, 'ఉద్రిక్తతలు లేవు. సంస్థలో ఏదైనా సంభవిస్తే దానిని ఎలా సరిదిద్దాలో మాకు తెలుసు' అని హొసబలే మీడియాతో చెప్పారు. మోడీ సహాయకుల్లో కచ్చితంగా లేని, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ఆర్ఎస్ఎస్ తిరుగులేని మద్దతు అందజేయడం ద్వారా ఆ పరిస్థితిని 'సరిదిద్దడమైంది'.లోక్‌సభ తీర్పు అనంతరం, యుపిలో పార్టీ పేలవ ప్రదర్శనకు బాధ్యతను ఆదిత్యనాథ్‌కు ఆపాదించి, ఆయనను మార్చేందుకు మోడీ షా ద్వయం ప్రయత్నించారు. ఆదిత్యనాథ్ ఇన్‌చార్జిగా అసెంబ్లీ ఉపఎన్నికల్లో పార్టీ అద్భుత ప్రదర్శన మోడీకి అఘాతమే అయింది. అంతేకాకుండా, బంగ్లాదేశ్ పరిణామాల నేపథ్యంలో ఆదిత్యనాథ్ చేసిన 'బాతేంగే తో కాటేంగే' (మనం సమైక్యంగా లేకపోతే బలి అవుతాం) వివాదాస్పద ప్రకటనను ఆర్ఎస్ఎస్ ఆమోదించింది. దీనితో మోడీ సహా వివిధ బిజెపి నేతలు ఆ వ్యాఖ్యను ఆధిపత్యవాద నినాదంగా మార్చారు.అది మహారాష్ట్రలోను, జార?ండ్‌లోను బిజెపి ఎన్నికల ప్రచారంలో కీలక నినాదం అయింది.

# రాష్టంలో రెండు కొత్త బస్ డిపోలు ఏర్పాటు

హైదరాబాద్, తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి రాష్ట్రంలో కొత్త బస్ డిపోలు ఏర్పాటు కాబోతున్నాయి. ఈ మేరకు రేవంత్ సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. ములుగు, పెద్దపల్లి జిల్లా కేంద్రాల్లో కొత్త బస్ డిపోలు ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆర్డర్ కాపీలను త్వరలో స్థానిక ప్రజా ప్రతినిధులకు అందించనున్నట్లు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీకి మంచి రోజులు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ లాభాల్లోకి అడుగు పెట్టిందని మంత్రి పొన్నం వెల్లడించారు. "దాదాపు ఆర్టీసీలో 10, 15 సంవత్సరాల తర్వాత రెండు కొత్త డిపోలను ఇస్తున్నాం. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రవాణాశాఖ మంత్రిగా నాకు చాలా సంతృప్తిని ఇస్తున్నది. గత 10, 15 సంవత్సరాలుగా నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీని ఈ రోజు లాభాల బాటలోకి తీసుకుపోతున్నాం. తెలంగాణలో మరో రెండు ఆర్టీసీ కొత్త బస్సు డిపోలు మంజూరు చేస్తున్నాం. ఆర్టీసీలో నూతన ఉద్యోగ నియామకాలు, నూతన బస్సుల కొనుగోలు, పలు సంస్కరణలు ,కార్మికుల సంక్షేమం కోసం కీలక నిర్ణయాలు తీసుకుంటున్నం. ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రాలుగా ఉన్న పెద్దపల్లి ములుగు జిల్లా లోని ఏటూరు నాగారంలో రెండు నూతన ఆర్టీసీ బస్సు డిపోలు ఏర్పాటు చేస్తున్నాం" అని పొన్నం వివరించారు. ములుగు, పెద్దపల్లి జిల్లాలో ఏర్పాటు చేసే బస్సు డిపోలకు సంబంధించి ఇప్పటికే ఆర్డర్లు జారీ అయినట్లు మంత్రి పొన్నం తెలిపారు. "కొత్త బస్ డిపోలకు సంబంధించిన ఆర్డర్ కాపీలను త్వరలోనే ఆయా జిల్లాల మంత్రులు అయిన సీతక్క, శ్రీధర్ బాబుకు అందిస్తాం. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ ముందడుగు వేస్తుందనడానికి ఈ బస్సు డిపోలు నిదర్శనం. రెండు కొత్త డిపోల ద్వారా ఆ ప్రాంత ప్రయాణీకులకు ఎంతో మేలు కలగనుంది. ములుగు జిల్లా మూడు, నాలుగు జిల్లాలకు సరిహద్దు. సమ్మక్క సారలమ్మ కొలువైన ప్రాంతం. తొందరలోనే అక్కడ బస్సు డిపో నిర్మాణం చేపట్టి ప్రయాణీకులకు అందుబాటులోకి తీసుకొస్తాం. పెద్దపల్లి పారిశ్రామిక కేంద్రం. జిల్లా కేంద్రం చేసినప్పటికీ బస్సు డిపో లేదు. అక్కడి శాసనసభ్యుడు, మంత్రి శ్రీధర్ బాబు సూచన మేరకు ఈ బస్సును మంజూరు చేస్తున్నాం. ములుగు, పెద్దపల్లి జిల్లా ప్రజలకు రవాణాశాఖ మంత్రిగా నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను" అని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులలో ఫ్రీగా ప్రయాణించేలా నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి జీవం పోసినట్లు అయ్యింది. సర్కారు నిర్ణయంతో ఆర్టీసీకి మంచి ఆదాయం అందుతోంది.

# సౌత్ కొరియా అధ్యక్షుడిపై అభిశంసన తీర్మానం

సౌత్ కొరియా, సౌత్ కొరియాలో మంగళవారం ఉన్నట్టుండి ఎమర్జెన్సీ విధించిన ప్రెసిడెంట్ యూన్ సుక్ యోల్ పై అక్కడి ప్రతిపక్షాలు అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఎమర్జెన్సీ విధింపును తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ తీర్మానం ప్రవేశపెట్టినట్లు సమాచారం. పార్లమెంట్ లో ప్రతిపక్షానికే మెజారిటీ ఉండడంతో అభిశంసన తీర్మానం నుంచి ప్రెసిడెంట్ యోల్ గట్టెక్కే సూచనలు కనిపించడంలేదని సౌత్ కొరియా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ తీర్మానంపై శుక్రవారం పార్లమెంట్ లో ఓటింగ్ జరుగుతుందని, ఆ లోపే అధ్యక్షుడు పదవి నుంచి దిగిపోయే సూచనలు కనిపిస్తున్నాయని అంటున్నారు. మంగళవారం రాత్రి టీవీ ప్రత్యక్షప్రసారంలో అధ్యక్షుడు యోల్ సౌత్ కొరియన్లను ఉద్దేశించి మాట్లాడారు. పార్లమెంట్ లో ప్రతిపక్షాలకు మెజారిటీ ఉండడంతో ప్రభుత్వాన్ని ప్రతీ విషయంలో అడ్డుకుంటున్నాయని, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. దాయాది దేశం నార్త్ కొరియాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రతిపక్షాలపై అధ్యక్షుడు తీవ్ర విమర్శలు చేశారు. వారిని కట్టడి చేసి, దేశంలో పరిస్థితిని చక్కదిద్దేందుకు మార్షల్ లా విధిస్తున్నట్లు ప్రకటించి ప్రజలను ఆశ్చర్యానికి గురిచేశారు. అయితే, ఈ నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత రావడం, పార్లమెంట్ కూడా వ్యతిరేకించడంతో బుధవారం ఉదయం మార్షల్ లాను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. దేశంలో మార్షల్ లా విధిస్తూ అధ్యక్షుడు చేసిన ప్రకటనపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. అంతేకాదు, అధ్యక్షుడిపై పార్లమెంట్ లో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఈ తీర్మానంపై శుక్రవారం పార్లమెంట్ లో ఓటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. అధ్యక్షుడు ఈ తీర్మానం గట్టెక్కాలంటే పార్లమెంట్ సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది (300 మందిలో 200 మంది ఎంపీలు) ఆయనకు మద్దతుగా ఓటేయాలి. అంతేకాదు, కనీసం ఆరుగురు రాజ్యాంగ న్యాయమూర్తులు కూడా మద్దతు తెలపాలి. అయితే, పార్లమెంట్ లో ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీకి చెందిన సభ్యులే ఎక్కువగా ఉన్నారు. దీంతో అధ్యక్షుడికి పార్లమెంట్ మద్దతు దక్కడం అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు.

# శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అనాథప్రేత సంస్కరణలు

అమరావతి, శ్రీశైల మహాక్షేత్రంలో శివైక్యం పొందిన వారి అంత్యక్రియలను గౌరవప్రదంగా నిర్వహించేందుకు అవసరమైన కైలాస రథాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని ఈవో చంద్రశేఖర్ ఆజాద్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర పరిధిలో దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బందింతో పాటు స్థానికులు, భక్తులు మరణించిన సందర్భాల్లో పార్థివ దేహాన్ని శానిటేషన్ ట్రాక్టర్లలో తీసుకువెళ్లడం బాధాకరమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి.. కైలాస రథం ఏర్పాటుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. అప్పటి వరకు నూతనంగా ఓ ట్రాక్టర్ వాహనాన్ని ఏర్పాటు చేసి అంతిమయాత్రలకు అనుమతించాలని సూచించారు. అదే విధంగా క్షేత్ర పరిధిలో మరణించిన వారిని ఖననం చేయడానికి మాత్రమే అనుమతులు ఉన్నాయని, పూడ్చడంతో పాటు సమాధులు నిర్మాణాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపారు. కాశీ మహాక్షేత్రంలో కూడా మృతదేహాలను కేవలం ఖననం చేస్తున్నారని.. అదే విధంగా పలు అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీ ప్రాంతాల్లో కూడా పూడ్చడం వంటి సాంప్రదాయాన్ని నిలిపివేస్తున్నారన్నారు. మృతదేహాలను పూడ్చి సమాధులు నిర్మించదలచిన వారు క్షేత్రానికి దూరంగా ఉండే గ్రామాల్లో అంత్యక్రియలు చేసుకునేందుకు కూడా దేవస్థానం వాహనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మల్లమ్మ కన్నీరు డంపింగ్ యార్డు వద్ద 50 సెంట్ల స్థలాన్ని ప్రత్యేకంగా స్మశానవాటికకు కేటాయించి తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. స్వామిఅమ్మవార్ల దర్శనార్థం కాలినడకన వస్తూ మార్గమధ్యలో శివైక్యం చెందిన వారి బంధుమిత్రులకు సమాచారం అందించి వారి స్వస్థలాలకు మృతదేహాన్ని ఉచితంగా చేరవేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. అదే విధంగా శివ సన్నిధిలో ప్రాణాలు కోల్పోతున్న సాధువులు, యాచకులు, అనాధుల మృతదేహాల అంతిమయాత్రను దేవస్థానం బాధ్యతా హిందూ సాంప్రదాయం ప్రకారం పురోహితులచే అంతిమ సంస్కారాలన్నీ శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఓ ప్రత్యేక

# ఇతిహాసపు చీకటి కోణాన్ని చెరిపేసేద్దాం

బాల్య వివాహాలు పాతకాలం నాటి మాట. కానీ ఆ అనాచారం నేటికీ కొనసాగుతోంది. స్త్రీ శక్తి ఏమిటో ప్రపంచానికి తెలిసిన ఈ రోజుల్లోనూ బాల్య వివాహాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరికి 18 ఏళ్ల లోపే వివాహం జరుగుతున్నట్లు 'ది లాన్సెట్ జర్నల్' వెల్లడించింది. అంతేకాదు కోవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా చదువులు చతికిల బడ్డాయి. పేదరికం పెరిగిపోయింది. ఫలితంగా వచ్చే దశాబ్ద కాలంలో కోటి మంది బాలికలువివాహ చట్రంలో ఇరుక్కుపోనున్నారు. ఏటా 1.2 కోట్ల మంది బాల్యంలోనే వివాహ వ్యవస్థలోకి నెట్టబడతా రని లాన్సెట్ చెబుతోంది. బాల్య వివాహాలు ఆడపిల్లల ఆరోగ్యానికి, జీవితానికి ముప్పు. లేత శరీరా లు.. తెలియని వయసు, పరిపక్వతలేని మనసు, అమ్మపై ఆధారపడే వయస్సులో అమ్మగా మార డం ఆ చిన్నారి ఎదుగుదలకు ఆటంకం. ‌బాల్య వివాహాలు నిరోధించడానికి రాజారామ్ మోహన్‌రారు, కందుకూరి వీరేశలింగం వంటివారు కృషి చేసినా ఈ మూఢాచారం నేటికీ కొనసాగటం దురదృష్ట కరం. తల్లి గర్భం నుంచే సమాజంతో నిత్యం పోరాటం చేయాల్సిన పరిస్థితి బాలికలది. సాధ్య మైనంత త్వరగా ఆడపిల్లకు పెళ్లి చేసి వదిలించుకోవాలన్న పురుషాధిక్య భావజాలం ఆడపిల్ల అందమైన కలలను, భవితను, జీవితాన్ని చిదిమేస్తోంది. చదువు, ఆటపాటలతో ఎదగాల్సిన బాలి కలు చిన్న వయసులో పెళ్లి వల్ల శారీరకంగా, మానసికంగా బలహీనులవుతారు. శారీరక, మాన సిక పరిపక్వత లేని వయసులో గర్భం ధరించడం వల్ల మాతాశిశు మరణాలు పెరుగుతు న్నాయి. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల చిన్నతనం నుంచే వారి హక్కులు ఉల్లంఘించబడుతూ, ఆర్థిక పరాధీనతను పెంచుతున్నాయి. 'బాల్య వివాహాలు బానిసత్వం యొక్క ఒక రూపం. దానిని రద్దు చేయాలి' అన్నారు నెల్సన్ మండేలా. బాల్య వివాహాలు సామాజిక దురాచారం. వీటిని అరికట్టడం వలన మాతా శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. దేశవ్యాప్తంగా బాల్య వివాహాలు అత్యధికంగా జరుగుతున్న ఏడు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. దేశంలో దాదాపు 300 జిల్లాల్లో జాతీయ సగటుతో పోలిస్తే బాల్య వివాహాల రేటు ఎక్కువగా వుందని తాజాగా ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత దేశంలో మొట్టమొదటిగా 1929లో బాల్య వివాహాలు నిషేధించబడ్డాయి. ఆ తర్వాత క్రమంగా పరిస్థితి మరింత మెరుగుపడుతూ వచ్చింది. అయినా నేటికీ బాల్య వివాహాలు జరుగుతూనే వున్నాయి. 8 ఏళ్లలోపు బాలికలు, 21 ఏళ్ల లోపు బాలురకు వివాహాలు చేస్తే, తల్లిదం డ్రులతోపాటు వివాహం చేసిన వారికి కూడా రెండేళ్లపాటు జైలుశిక్ష విధిస్తారని చట్టం చెబుతోంది. బాలలకు చట్టంలో సమానత్వం వుందని, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యం రావాలని తాజాగా కేంద్ర ప్రభుత్వం 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమం చేపట్టింది. 2030 నాటికి బాల్య వివాహ రహిత భారతదేశమే లక్ష్యంగా ముందుకెళ్లాలని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపున దేశవ్యాప్తంగా బాల్యవివాహాలు నిరాఘాటంగా జరుగుతున్నాయి.మనిషి కథ ఆరంభమైన చోటనే అంతం కాకూడదు, అది సంతాపంగా మారకూడదు. ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు. బాల్య వివాహ వ్యవస్థను రూపుమాపేది, వారి జీవితాన్ని వెలుగు దివ్వెగా మార్చేది, పురుషాధిక్యతను ప్రశ్నించేది చదువు మాత్రమే. ఇది నిషిద్ధ స్వప్నం కాదు. ఈ పురుషాధిపత్య సంకెళ్లను ఛేదించి, తమ పూర్తి సామర్థ్యాన్ని చేరుకునే సాధికారయత్నం. ఇతిహాసపు చీకటి కోణాన్ని చెరిపేసి ఆడబిడ్డను బతకనివ్వాలి.. ఎదగనివ్వాలి..చదవనివ్వాలి? ఎగరనివ్వాలి.

## రజాకార్లను తలపిస్తున్న రేవంత్ పాలన

హైదరాబాద్, ప్రజా పాలన పేరుమీద నయా రజాకార్ల రాజ్యం మళ్లీ వచ్చిందని.. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ చూపిస్తున్న జులుం చూస్తే స్పష్టంగా అర్థం అవుతున్నదని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూడవత్ రాంబల్ నాయక్ పేర్కొన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పాడి కౌశిక్ రెడ్డిని బేషరతుగా విడుదల చేయాలని రాంబల్ నాయక్ డిమాండ్ చేశారు. మీ దుర్మార్గమైన పాలనను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. ఏడాది కాలంగా మీరు చేస్తున్న దోపిడి చూస్తే ప్రజలందరికీ స్పష్టంగా అర్థమైంది.. ఇది రజాకార్ల పాలన కంటే దారుణమైన పాలన అని. ఈ క్రమంలోనే ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు యత్నిస్తున్నారు. అక్రమ అరెస్టులతో భయపెట్టాలని చూస్తే.. ఇక్కడ భయపడేవారు ఎవరూ లేరు. రేవంత్ రెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. హరీశ్‌రావును అరెస్టు చేసి భయపెట్టించాలనుకోవడం.. సీఎం మూర?త్వమే. అక్రమ అరెస్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే క్షమాపణ చెప్పి హరీశ్‌రావు, పాడి కౌశిక్ రెడ్డితో పాటు మిగతా బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని రాంబల్ నాయక్ డిమాండ్ చేశారు.

## నిపుణులకు పరీక్షగా మారిన ప్రాంతం

హైదరాబాద్,ప్రకృతి వైపరీత్యాలకు మేడారం అటవీ ప్రాంతం కేంద్రబిందువుగా మారింది. ఈ ప్రాంతంలో జరుగుతున్న వరుస సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. బుధవారం ఉదయం 7.27 గంటల సమయంలో జరిగిన భూకంపం ములుగు అటవీ ప్రాంతంలోని మేడారం సమీపంలోని రామన్నగూడెం కేంద్రంగా చోటు చేసుకున్నట్టుగా అధికారులు నిర్ధారించారు. వరుసగా జరుగుతున్న సంఘటనలతో ములుగు జిల్లా ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 4వ తేదీన మేడారం సమీపంలోని దట్టమైన అడవిలో 50వేలకు పైగా చెట్లు ఒక్కసారిగా నేలకూలిన సంఘటన తీవ్ర చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. ఇప్పటికీ ఆ సంఘటనకు పూర్తి కారణాలను తెలుసుకోలేకపోయారు. నిపుణులు దానికి సంబంధించిన విశ్లేషన్లో ఉన్నారు. ఈ సంఘటన జరిగిన మూడు నెలలకు డిసెంబర్ 4న బుధవారం రిక్టర్ స్కేల్ పై 5.3 తీవ్రతతో భూకంపం సంభవించడం ఆందోళన కలిగిస్తుంది.గోదావరి పరివాహక ప్రాంతంగా ఉన్న మేడారం కేంద్రంగా 40 కిలోమీటర్ల లోతులో ఏర్పడిన ఈ భూకంపం ప్రభావం 225 కిలోమీటర్ల విస్తీర్ణంలో తెలంగాణ, ఏపీ, చత్తీస్ గడ్, మహారాష్ట్రల్లోని పలు ప్రాంతాల్లో సంభవించినట్టుగా అధికారులు తెలిపారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేట్ పై 5.3గా నమోదయినట్టుగా ప్రాథమికంగా తెలుస్తోంది. భూకంపానికి గల కారణాలు ఏమిటీ అన్న విషయంపై సిస్మలాజికల్ విభాగం నిపుణులు పూర్తిస్థాయిలో పరిశోధనలు జరుపుతున్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతంతో పాటు సమీపంలో బొగ్గు గనులు కూడా ఉన్నాయి.

మేడారం సమీప ప్రాంతంలో

ములుగు జిల్లా మేడారం అటవీ ప్రాంతం కేంద్రంగానే జరిగిన భూకంపం సంచలనంగా మారింది. సెప్టెంబర్ 4న ములుగు జిల్లా మేడారం అటవీ ప్రాంతంలో ప్రకృతిలో పెను మార్పులు సంభవించిన సంగతి తెలిసిందే. సుడిగాలుల బీభత్సం కారణంగా 50 నుండి 70 వేల మేర చెట్లు నేలకూలిపోయాయి. సుడిగాలి తీవ్రత ఏ స్థాయిలో చోటు చేసుకుందంటే చెట్ల వడిపెట్టినట్టుగా చుట్టుకపోగా ఇరువైపులా వంగిపోయాయి. మరికొన్ని చెట్లు అయితే చీలికలు కాగా ఇంకొన్ని కూకటి వేళ్లతో సహా పెకిలించబడ్డాయి. దేశంలోనే అత్యంత అరుదైన ఘటనగా అటవీ శాఖ అధికారులు సెప్టెంబర్ 4న జరిగిన ఘటనపై వివరించారు. పరిశోధనలు జరిపేందుకు నిపుణులను కూడా రంగంలోకి దింపుతున్నామని అటవీ శాఖ అధికారులు అప్పుడు ప్రకటించారు.

# సోషలిజం సుప్రీం కోర్టు వ్యాఖ్యలు...

రాజ్యాంగ పీఠిక నుండి 'సోషలిజం' అన్న పదాన్ని తొలగించాలని కోరుతూ సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్ మీద నవంబరు 22న జరిగిన విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రెండు వ్యాఖ్యలు చేశారు. అవి ప్రాధాన్యత కలిగినవి. మొదటిది: రాజ్యాంగ పీఠికలో 'సోషలిజం' అన్న పదాన్ని ఒక సైద్ధాంతిక పరమైన ప్రాతిపదిక నుండి ఉపయోగించలేదని, అది ఒక సంక్షేమ రాజ్యాన్ని సూచించేదిగా, పౌరులందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేసే అర్థంలో ఉపయోగించారని అన్నారు. రెండవది: ఈ అర్థంలో సోషలిజం అనేది రాజ్యాంగ మౌలిక పునాదిలో అంతర్భాగంగా ఉంటుందని, ఏదో అదనంగా తోడు చేసిన పదంగా దానిని పరిగణించకూడదని, భారతీయ గణతంత్ర సమాజం ఏ విధంగా ఉండాలో దాని సారాంశంతో సోషలిజం అన్న పదం పెనవేసుకుని వుందని ఆయన అన్నారు.సోషలిజం అన్న పదానికి ఒక వ్యవస్థీకృత అర్థాన్ని ఇవ్వడానికి ప్రధాన న్యాయమూర్తి సంసిద్ధులు కాలేదు. ప్రపంచం మొత్తం మీద 'సోషలిజం' అన్న పదాన్ని ఉత్పత్తి సాధనాలను, కనీసం కీలకమైన ఉత్పత్తి సాధనాలను సమాజ ఉమ్మడి ఆస్తిగా ఉంచడం అన్న అర్థంలో వాడతారు. కాని ప్రధాన న్యాయమూర్తి ఆ అర్థంలో కాకుండా, ఫలితం ప్రాతిపదికగా సోషలిజాన్ని నిర్వచించారు. ప్రైవేటు సంస్థలు మనుగడలో ఉండడం (అంటే ఉత్పత్తి సాధనాలు ప్రైవేటు ఆస్తిగా ఉండడం) అనేది సోషలిజానికి ఏవిధంగానూ ఆటంకం కాబోదని, ఎవరి ఆస్తి అన్నదానితో నిమిత్తం లేకుండా పౌరులందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేయగలిగే సంక్షేమ రాజ్య స్థాపనే ముఖ్యం అన్నది దాని భావం.ఉత్పత్తి సాధనాల యాజమాన్యం ఎవరిది అన్న దానిని బట్టి సోషలిజాన్ని ఒక వ్యవస్థీకృత ప్రాతిపదికన నిర్వచించడం సర్వత్రా ఉంది. అందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేయాలంటే ముందు ఉత్పత్తి సాధనాలు సమాజపరం అవడం అవశ్యంగా జరగాలన్న అవగాహనతోటే ఆ విధంగా జరుగుతోంది. ఐతే ప్రధాన న్యాయమూర్తి ఉత్పత్తి సాధనాలను సమాజపరం చేయకుండానే అందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేయవచ్చునని సూచిస్తున్నారు. వాస్తవానికి సోషలిజం అన్నది కేవలం ఒక సంక్షేమ రాజ్యాన్ని నిర్మించడం అన్న లక్ష్యంతో మాత్రమే పరిమితం కాదు. దాని లక్ష్యం అంతకన్నా చాలా విస్తృతంగా ఉంటుంది. సమాజంలోని తక్కిన మానవులతో సంబంధాలన్నీ తెగిపోయి ఒంటరిగా మిగిలిపోయే వ్యక్తులతో నిండిన, ముక్క చెక్కలైన పరిస్థితిని పెట్టుబడిదారీ వ్యవస్థ కల్పిస్తుంది. ఆ పరిస్థితిని అధిగమించి ఒక నూతన సమాజాన్ని నిర్మించడం సోషలిజం లక్ష్యం. అటువంటి నూతన సమాజం అందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేయగలిగి వుండడం కూడా అవశ్యంగా జరగాలి.ఉత్పత్తి సాధనాలను సమాజపరం చేయకుండా అటువంటి సంక్షేమ రాజ్యాన్ని నిర్మించడం సాధ్యమేనా అన్నది ఇక్కడ ప్రశ్న.అది సాధ్యం కాదు అని మనం విశ్వసిస్తున్నాం. కాని, ఉత్పత్తి సాధనాలు ప్రైవేటు ఆస్తిగా ఉండడానికి, సమాన అవకాశాలను గ్యారంటీ చేయగలగడానికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఇప్పుడు చర్చనీయాంశంగా చేయబోవడం లేదు. ప్రధాన న్యాయమూర్తి ప్రకటించినట్టుగా రాజ్యం పౌరులందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేయగలగాలన్న అంశానికే సుప్రీం కోర్టు కట్టుబడి ఆ ప్రకారం నడుచుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. సమాన అవకాశాలు అందరికీ ఉండే సమాజం ఏవిధంగా ఉండాలో పరిశీలించాలని కోరుతున్నాం.ప్రస్తుతం భారత సమాజంలో ఒకపక్క సంపద కేంద్రీకరణ, మరొక పక్క నిరుద్యోగం, పౌష్టికాహారాన్ని సైతం పొందలేకపోతున్నంతగా పేదరికం పెరుగుతున్న పరిస్థితి ఉంది. అందుచేత మన సమాజం అందరికీ సమాన అవకాశాలను కల్పించే దిశగా నడుస్తోందని ఎవరూ వాదించలేరు. మరి ఆ దిశగా నడుస్తోందని నిర్ధారించడానికి పరిగణనలోకి తీసుకోవలసిన సూచికలేమిటి?నిరుద్యోగం లేదా మార్క్స్ చెప్పినట్టు శ్రామికుల రిజర్వు సైన్యం ఉన్నప్పుడు సమాజంలో సమాన అవకాశాలు ఉండవన్నది స్పష్టం. ఒకవేళ నిరుద్యోగులకు భృతి కల్పించినా, ఆ నిరుద్యోగుల ఆదాయాలకు, కార్మికుల



ఆదాయాలకు మధ్య తేడా ఎక్కువగానే ఉంటుంది. ఆ నిరుద్యోగుల సంతానం సైతం ఏమీ పొందలేని స్థితిలో ఉంటారు. వారికి, కార్మికుల సంతానానికి మధ్య సమాన అవకాశాలు గ్యారంటీ చేయడం అసాధ్యం.నిరుద్యోగం వల్ల ఏర్పడే ఆర్థిక అసమానతే కాకుండా నిరుద్యోగిగా ఉండడం అనేదే సమాజంలో ఒక శాపంగా పరిగణించబడే స్థితిలో, ఆత్మ గౌరవాన్నే కోల్పోయిన ఆ నిరుద్యోగుల సంతానం చిన్నతనం నుండే గాయపడ్డ మనస్సులతో జీవితాన్ని ప్రారంభిస్తారు. అటువంటి పరిస్థితిని నివారించాలంటే, సమాన అవకాశాలను కల్పించాలంటే ముందు నిరుద్యోగాన్ని లేకుండా చేయాలి.ఆర్థిక లేమిని తొలగించాలంటే అందుకు ఒక మార్గం నిరుద్యోగ భృతిని కూడా కార్మికులు పొందే వేతనంతో సమానంగా చెల్లించడం. కాని ప్రైవేటు సంస్థలు ఉండే వ్యవస్థలో ఇది అసాధ్యం. ప్రైవేటు రంగం గణనీయంగా కొనసాగే సమాజంలో– అది కేవలం పెట్టుబడిదారీ వ్యవస్థే కానక్కరలేదు– నిరుద్యోగం ఉండడం అనేది కార్మికులను అదుపులో ఉంచే సాధనంగా ఉంటుంది. అందుచేత అటువంటి ఆర్థిక వ్యవస్థల్లో నిరుద్యోగులకు ఇచ్చే భృతి కార్మికులకు ఇచ్చే వేతనాలతో సమానంగా ఉండడం ఆమోదయోగ్యం కాజాలదు. సమానంగా ఉంటే అప్పుడు నిరుద్యోగం కార్మికులను అదుపులో ఉంచే సాధనంగా ఉండలేదు. పూర్తి స్థాయి ఉపాధి కల్పన జరిగిన సమాజంలో ఒక కార్మికుడిని పని నుండి తొలగించడం అనేది ఒక శిక్షగా ఉండలేదు. ప్రైవేటు సంస్థలు కొనసాగడానికి, సమాన అవకాశాలు గ్యారంటీ చేయాలన్న లక్ష్యానికి మధ్య ఉన్న మొట్టమొదటి వైరుధ్యం నిరుద్యోగం విషయంలోనే. ఈ విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి అంగీకరించక పోయినప్పటికీ, సమాన అవకాశాలను గ్యారంటీ చేయడానికి నిరుద్యోగం ఆటంకం అని గుర్తించక తప్పదు.సమాన అవకాశాలను గ్యారంటీ చేయాలంటే పరిగణించాల్సిన రెండో అంశం ఆస్తి వారసత్వాన్ని పూర్తిగా గాని దాదాపుగా కాని లేకుండా చేయడం. వారసత్వ హక్కు కొనసాగుతున్నప్పుడు ఒక శతకోటీశ్వరుడి కుమారుడు, ఒక కార్మికుడి కుమారుడు సమాన అవకాశాలను కలిగివున్నట్టు చెప్పలేం కదా. ఆ శతకోటీశ్వరుడి కుమారుడికి అప్పుడు ఆ కోట్లాది సంపద సంక్రమిస్తుంది. వాస్తవానికి బూర్జువా ఆర్థిక శాస్త్రం కూడా వారసత్వ హక్కును సమర్థించలేదు. పెట్టుబడిదారులకు తక్కినవారికన్నా అదనంగా కొన్ని ప్రత్యేక సామర్థ్యాలు ఉన్నందువల్లే వారికి లాభాలు సమకూరుతాయన్న ప్రాతిపదికన అది పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థిస్తుంది. దానివల్ల పోగుబడే సంపద మీద హక్కు అటువంటి ప్రత్యేక సామర్థ్యంతో నిమిత్తం లేకుండా వారసత్వంగా ఆ పెట్టుబడిదారుడి సంతానానికి సంక్రమించడాన్ని ఏవిధంగా సమర్థించగలుగుతుంది? అందువల్లే చాలా పెట్టుబడిదారీ దేశాల్లో వారసత్వ పన్ను రేటు చాలా ఎక్కువగా ఉంటుంది. జపాన్‌లో అత్యధికంగా 55 శాతం ఉంటే, తక్కిన దేశాల్లో 40 శాతం దాకా ఉంది. కాని ఆశ్చర్యకరంగా భారతదేశంలో వారసత్వ పన్నే లేదు. మరి సమాన అవకాశాల కల్పనకు ఆస్కారం ఎక్కడుంటుంది?ఇక సమాన అవకాశాలు కల్పించడానికి తేల్చాల్సిన మూడవ అంశం సంపద అసమానతలను కనీస స్థాయికి తీసుకురావడం. సంపద అంటే అధికారం. అందులో రాజకీయ అధికారమూ ఉంటుంది, సామాజిక అధికారమూ ఉంటుంది.

# కేసీఆర్ చేయలేనిది.. రేవంత్ ఎలా చేస్తున్నారు..?



హైదరాబాద్,తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ చేసిన హామీలు, ప్రమాణాలు, అభివృద్ధి మాటల తూటాలు, జల్, జమీన్, జాబ్స్ గురించి చేసిన మాటలు ఇప్పటికీ మన చెవుల్లో గిర్రుగిర్రు మని తిరుగుతూనే ఉన్నాయి. కానీ కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఉద్యమ కాలంలో ఇచ్చిన హామీలు వాగ్దానాలు ప్రమాణాలు మరిచి, ప్రజల అభివృద్ధిని చూడకుండా ఓట్లను కురిపించే వ్యవస్థలను తయారు చేయడం చూశాం. అయితే కేసీఆర్ మనోగతాన్ని పసిగట్టిన ప్రజలు మూడోసారి సీఎం సీటుకి ఆమడ దూరంలో ఉంచారు.కేసీఆర్ తన 10 సంవత్సరాల పాలనలో చేయలేని ఎన్నో సాహసోపేత నిర్ణయాలను, ఎన్నో పనులను సీఎం రేవంత్ రెడ్డి నేడు అవలీలగా చేస్తూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన విధ్వంస పాలనను పునర్నిర్మాణం వైపు, అభివృద్ధి వైపు తీసుకువెళ్లేలా అడుగులు వేయడం చూస్తూనే ఉన్నాం.. కాంగ్రెస్ పార్టీ ఒక ఏడాది పాలన సందర్భంగా కేసీఆర్ వర్సెస్ రేవంత్ రెడ్డి పాలన గూర్చి చర్చిద్దాం!

ప్రగతి భవన్ టు ప్రజా భవన్

ఆత్మగౌరవం అధికం గల తెలంగాణ ప్రజలకు, గద్దర్ లాంటి వాళ్లకు సైతం ప్రజాభవన్‌కు వెళ్లడానికి ప్రవేశ అనుమతి లేకపోవడం బాధాకరం. ప్రజల ఆస్తులను సొంత జాగీర్దార్ రాజ్యం లాగా అహంకారంతో ప్రవర్తించారు. అందుకే రేవంత్ రెడ్డి అధికారం అందుకున్న క్షణాల్లోనే కాంగ్రెస్ గేట్లు, బారికేడ్లను తొలగించి ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి సామాన్య జనులకు సైతం ప్రవేశం కల్పించారు. ఇక కేసీఆర్ సీఎంగా ఉన్నంతకాలం సెక్రటేరియట్ వైపు చూడలేదు. కనీసం ప్రతిపక్ష నాయకుడిగా కూడా అసెంబ్లీకి రాకపోవడం.. వచ్చిన ఒకేసారి కేవలం 10–15 నిమిషాల పాటు ఉండిపోవడం రాజ్యాంగ సంస్థల పట్ల తనకున్న నిబద్ధతను తెలియజేస్తుంది. అదే రేవంత్‌రెడ్డి గురించి తెలిసిన విషయమే కదా.

నిరుద్యోగులకు ఉద్యోగాల హామీ!

తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రభుత్వంలో కొలువు తీరాక పదే పదే లక్ష ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని కేసీఆర్ హామీలు గుప్పిచ్చి, అధికారంలోకి వచ్చిన 10 సంవత్సరాల్లో కనీసం 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలను ఇవ్వలేదు, సరికదా వారిలోనూ అస్మదీయులే ఎక్కువగా ఉండటం బాధాకరం. కానీ తన కుటుంబంలో అందరికీ ఆలస్యం చేయకుండా ఉద్యోగాలు ఇచ్చారు. అంతేగాదు.. పలుమార్లు ప్రశ్నాపత్రాలు లీక్ కావడం, నిరుద్యోగుల మరణాలు. వీటితో పోలిస్తే రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి ఒక ఏడాది కాలంలోనే 55వేల నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన ఘనత చూశాం.

దళితుల విషయంలో..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన వెంటనే దళితుడిని ముఖ్యమంత్రిగా చేస్తామని, లేకపోతే తల నరుక్కుంటానని ఆడిన మాటను అడ్డంగా పాతర వేయడమే కాకుండా, కనీసం అంబేద్కర్ జయంతి, వర్ధంతి సందర్భంగా ఆ మహానాయకుని ఫొటోకి దండ వేసి నమస్కారం చేసిన సందర్భాలు చూశారా? ప్రతి పేద దళిత కుటుంబానికి 3 ఎకరాల భూమి అందిస్తామని చెప్పిన కేసీఆర్ ఆ తర్వాత మాట మార్చారు. హుజురాబాద్‌లో ఈటెల రాజేందర్‌ను ఎన్నికల్లో ఓడిం చడం కోసం రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టి, తరువాత ఆ పథకాన్ని నీరు కార్చలేదా? కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం దళిత ఉప వర్గీకరణకు జ్యుడీషియల్ కమిషన్ వేసింది. అట్లానే ఇంది రమ్మ డబుల్ బెడ్ రూముల పథకాన్ని నిలబెట్టుకునే దశలో ఉంది.

రైతుల విషయంలో..

ఎన్నికల ముందు రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక పాక్షికంగా కొన్ని దశల్లో మాత్రమే అమలు చేశారు. అనాడు మల్లన్న సాగర్, సుందిళ్ల రైతులకు సంకెళ్లు వేసిన బీఆర్ఎస్ నేడు రైతులను రెచ్చగొట్టి రాజకీయ అస్థిరత్వం సృష్టిస్తోంది. పంట నష్టం, అప్పుల్లో ఉన్నప్పుడు, రుణమాఫీ లేకపోవడం వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చిన 12 నెలల కాలంలో దాదాపు 19,880 కోట్లు రుణమాఫీ, 7,625 కోట్లు రైతు భరోసా, 1,455 కోట్లు రైతు బీమా, ఉచిత విద్యుత్ 10,444 కోట్లు, సన్న వడ్ల బోనస్ కోసం 5,040 కోట్లు వరకు ఖర్చు చేయడం దేశ చరిత్రలోనే సాహసోపేతమైన చర్యలుగా చెప్పొచ్చు. ఫలితంగా అనంతర కాలంలో రైతుల ఆత్మహత్యలు చాలా వరకు తగ్గిన విషయం తెలిసిందే కదా !

రెవెన్యూ వ్యవస్థ, ధరణి సమస్యలు..

రెవెన్యూ వ్యవస్థలో ధరణితో కొత్త సమస్యలు సృష్టించడమే కాకుండా అస్మదీయులకే ఆయు ధంగా మారి కబ్జాలకు, తప్పుడు రిజిస్ట్రేషన్లకు, అవినీతికి అక్రమాలకు కేరాఫ్‌గా మిగిలింది. ఆనాడు రెవెన్యూ వ్యవస్థను విధ్వంసం చేసిన పాపాన్ని కడిగే దిశగా, నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉన్నత స్థాయి తటస్థ నిపుణులచే భూకమిషన్ వేసింది. త్వరలోనే ప్రజలు కోరు కున్న విధంగా భూ సంస్కరణలు రాబోతున్నాయి.

కేజీ టూ పీజీ ..

రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్ల నుంచి కేజీ టూ పీజీ నాణ్యమైన విద్య ఉచితంగా అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పలుసార్లు చెబుతూ వచ్చిన కేసీఆర్‌కి, తొలి కేజీ టూ పీజీ విద్యాలయం కట్టడానికి 9 సంవత్సరాలు పట్టింది. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం జిల్లాకు ఒకటి చొప్పున ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభించడం గొప్ప సంస్కరణగా చెప్పవచ్చు. నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం భిన్నత్వంలో ఏకత్వం వైపు సమగ్రంగా భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా పెద్ద మొత్తంలో పథకాన్ని ప్రవేశపెట్టడం గొప్ప పని.

# కాకినాడ సెజ్, పోర్టు ఆక్రమణలో జగన్‌ను ఏ1గా చేర్చాలి

నెల్లూరు, కాకినాడ సెజ్, పోర్టు ఆక్రమణల కేసులో జగన్‌ఏ1గా ఎఫ్ఐఆర్‌లో సీఐడీ చేర్చాలని ఆక్వాకల్చర్ అథారిటీ ఛైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి డిమాండ్ చేశారు. వైసీపీ నేతలు పందుల గుంపు మాదిరి 8320 ఎకరాల కాకినాడ సెజ్ దోపిడీకి దిగారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా గురువారం ఆయన నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ.. కత్తులు, గన్నులతో కేవీరావును అన్ని విధాలా బెదిరించి భయపెట్టి 4 వేల ఎకరాల భూమిని కేవలం 12 కోట్ల రూపాయల పేరుతో అప్పనంగా కొట్టేశారని ఆరోపించారు. భారతదేశంలో రూ.29 వేలకు ఎక్కడా దొరకని ఎకరా భూమి జగన్ వర్గీయులకు మాత్రమే కాకినాడ సెజ్‌లో ఎలా దొరుకుతుందని ఆయన ప్రశ్నించారు. డబ్బులు సంపాదించే కంపెనీని బెదిరించి గుంజుకోవటం వీరి నైజమని అన్నారు. ప్రముఖ కన్సల్టెంట్ రోహిత్ చతుర్వేది ఇచ్చిన నివేదిక ప్రకారం కాకినాడ సెజ్‌లో ఎకరా రేటు రూ. 50 లక్షల పైచిలుకు ఉందని ఆనం వెంకట రమణారెడ్డి అన్నారు. 2 వేల కోట్ల రూపాయల విలువైన కేవీరావు వాటా భూమిని రూ.12 కోట్లు ఇస్తామని చెప్పి కొట్టేశారన్నది సుస్పష్టమన్నారు. చెక్ రూపంలో ఇచ్చిన రూ. 12 కోట్లు కూడా 6 నెలల తర్వాత బ్యాంకులో జమ చేసుకోమనటాన్ని దోపిడీ అనాలా దొంగతనం అనాలా.. చెక్ రూపంలో ఇచ్చిన రూ. 12 కోట్లు 6 నెలల తర్వాత జమ కావటం సాధ్యమా.. అని ప్రశ్నించారు. జగన్ ప్రమేయం లేకుండా ఇది జరగని పని అని, కాకినాడ పోర్టు కైవసం కోసం భారీ మోసానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఒకే కంపెనీని ఇద్దరు కన్సల్టెంట్లు ఆడిట్ చేసి వెయ్యి కోట్ల రూపాయలు ప్రభుత్వానికి కట్టాలని ఒత్తిడి తెచ్చారని, అలా కట్టని పక్షంలో పోర్టు స్వాధీనం చేయాలని బెదిరించి లొంగతీసుకోవటంతో పాటు షిప్పింగ్ ఏజెంట్లను భయపెట్టారని, కేవీరావు వాటా అమ్మే వరకూ గొంతుమీద కత్తి పెట్టి మరీ బెదిరించారని ఆనం వెంకట రమణారెడ్డి దుయ్యబట్టారు. కాగా వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం లుక్ ఔట్ సర్క్యులర్ జారీ చేసింది. ఆయనతోపాటు వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి, అరబిందో యజమాని శరత్ చంద్ర రెడ్డిపై ఎల్వోసీ ఇచ్చింది. ఈ ముగ్గురూ విదేశాలకు పారిపోకుండా ముందు జాగ్రత్తగా ఈ సర్క్యులర్ జారీ చేసింది. కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్, కాకినాడ సెజ్‌లోని రూ. 3,600 కోట్ల విలువైన వాటాలను కర్నాటి వెంకటేశ్వరరావు, కేవీ రావు నుంచి గత ప్రభుత్వ హాయంలో బలవంతంగా లాగేసుకున్నారంటూ సీఐడీ నమోదు చేసిన కేసులో కీలక నిందితులుగా వీరున్నారు. వాటాలు రాసివ్వకపోతే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని కేవీ రావును బెదిరించి, భయపెట్టి అత్యధిక షేర్లను అరబిందో సంస్థ సొంతం చేసుకుందనేది ప్రధాన అభియోగం. దీనిపై కేవీ రావు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు సీఐడీ అధికారులు నమోదు చేసిన కేసులో విజయసాయిరెడ్డి, విక్రాంత్ రెడ్డి, శరత్ చంద్రారెడ్డి.. ఈ ముగ్గురు కీలక నిందితులుగా ఉన్నారు. కేవీ రావు స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డు చేస్తున్నారు. విక్రాంత్ రెడ్డిపై ఇప్పటికే సీఐడీ గురిపెట్టింది. కేవీ రావుతోపాటు మరికొందరి స్టేట్‌మెంట్లు కూడా రికార్డు చేయాలని సీఐడీ అధికారులు భావిస్తున్నారు. అధికారులు కేసు రిజిస్టర్ చేసిన వెంటనే లుకౌట్ నోటీసులుజారీ చేశారు. ఈ ముగ్గురు విదేశాలకు పారిపోకుండా దేశంలో ఉన్న అన్ని విమానాశ్రయాలకు ఎల్వోసీలు పంపినట్లు సీఐడీ అధికారులు పేర్కొన్నారు. వారిని విచారించేందుకు త్వరలో నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ ఎన్.శ్రీధర్

హైదరాబాద్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ ఎన్.శ్రీధర్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయనకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీచేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన కొనసాగుతారని పేర్కొన్నారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న బుర్రా వెంకటేశంను ప్రభుత్వం టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన వాలంటరీ రిటైర్‌మెంట్‌కు ప్రభుత్వం అనుమతించింది. ఈ నేపథ్యంలో వెంకటేశం స్థానంలో ఎన్.శ్రీధర్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. శ్రీధర్ 1997 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఆయన ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల్లో పలు క్యాడర్లలో సేవలందించారు. మొదట రాజమండ్రి సబ్ కలెక్టర్‌గా,ఊట్నూరు ఐటీడీఏ పీఓగా, పోర్ట్స్ డైరెక్టర్‌గా కాకినాడలో పని చేశారు.అనంతరం అనంతపురం,కృష్ణ, వరంగల్,రంగారెడ్డి జిల్లాల్లో కలెక్టర్‌గా పని చేశారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమ ం త్రి కార్యాలయంలో స్పెషల్ సెక్రెటరీగా మూడేళ్ల మూడు నెలల పాటు పని చే శారు. తెలంగాణ ఏర్పాట తర్వాత నుంచి 2015 జనవరి ఒకటి నుంచి ఇ ప్పటి వరకు తెలంగాణలోని సింగరేణి కంపెనీ కాలరీస్ లిమిటెడ్ సీఎండీగా బాధ్యతలు నిర్వర్తించారు.గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీధర్ స్థానంలో బలరామ్‌ను సీఎండీగా నియమించిన విషయం తెలిసిందే.

## 80 శాతం.... జనరల్ కేటగిరీ ప్రొఫెసర్లే

న్యూఢిల్లీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ల అధ్యాపకులలో ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు చెందిన వారు చాలా తక్కువ శాతం ఉన్నారు. వీటిల్లో దాదాపు 80 శాతానికి పైగా జనరల్ కేటగిరీకి చెందిన అధ్యాపకులే బోధిస్తున్నారని ఆర్‌టిఐ (రైట్ టు ఇన్ఫర్మేషన్ – సమాచార హక్కు) ద్వారా వెల్లడైంది. రెండు ఐఐటిలు, మూడు ఐఐఎంల్లో అయితే జనరల్ కేటగిరీ వాటా 90శాతానికి మించిపోయింది. మరో ఆరు ఐఐటిల్లో, నాలుగు ఐఐఎంల్లో జనరల్ వాటా 80–90 శాతం మధ్య వుందని సమాచార హక్కు ద్వారా అందిన సమాచారం తెలియజేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఐఐటి, ఐఐఎంల సంస్థల నుంచి తీసుకున్న సమాచారం మేరకు ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఐఐటి, ఐఐఎంల తోపాటు ఇతర విద్యా సంస్థల్లో అధ్యాపకుల పోస్టుల కోసం కేంద్రం రిజర్వేషన్లను కల్పించింది. ఓబిసిలకు 27 శాతం, ఎస్‌సిలకు 15 శాతం, ఎస్‌టిలకు 7.5 శాతం మేర రిజర్వేషన్లు ఇచ్చారు. వెనుకబడిన తరగతుల వారికి కేంద్రం అవకాశాలు కల్పించినా ఆచరణలో అవి అమలు కావడం లేదు. ఇండోర్ ఐఐఎంలో 109 పోస్టుల్లో 106 పోస్టులు జనరల్ కేటగిరీలోని వారితోనే నడుస్తున్నాయి. ఈ ఐఐఎంలో ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన అధ్యాపకులే లేరని ఆర్‌టిఐ తెలిపింది. ఇక ఉదరుపూర్‌లో కూడా 90 శాతానికి పైగానే, ఐఐఎం లక్నోలో కూడా 95 శాతానికి పైగా జనరల్ కేటగిరీకి చెందినవారే అధ్యాపకులుగా ఉన్నారు. ఆరు ఐఐఎంలను పరిశీలించినట్లైతే ఒక్క ఎస్‌టి కేటగిరికి చెందిన అధ్యాపకులు కూడా లేరు. బెంగళూరు ఐఐఎంలో 85 శాతానికిపైగా జనరల్ కేటగిరీ అధ్యాపకులు ఉన్నారు. అందుకే రిజర్వేషన్లకు తగ్గట్టుగా అధ్యాపకుల్ని నియమించాలని అక్కడ నిరసనలు జరిగాయి. ఐటి ముంబయి, ఐఐటి ఖరగ్‌పూర్‌లలో 700కి పైగా అధ్యాపక పోస్టుల్లో 90 శాతం పదవుల్లో జనరల్ కేటగిరిగికి చెందిన వ్యక్తులే ఉన్నారు. మండీ, గాంధీనగర్, కాన్పూర్, గౌహతి, ఢిల్లీ ఐఐటిల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. 80–90 శాతం మేర జనరల్ కేటగిరీ వారే అధ్యాపకులుగా ఇక్కడ ఉన్నారు.

# సంచలనం రేపుతోన్న హరీష్ ఫోన్ ట్యాపింగ్ కేసు



హైదరాబాద్,హరీష్ రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపుతోంది. ఈ కేసులో మాజీ మంత్రి హరీష్ రావుపై కేసు నమోదైంది. సిద్దిపేట కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేస్ను÷ల్ చేశారు. హరీష్‌తోపాటు ట్యాపింగ్ కేసులో నిందితుడైన రాధాకిషన్ రావుపై 120 బీ, 386, 409, ఐటీ యాక్ట్ కింద కేసులు పెట్టారు. పక్కా ఆధారాలతో అన్నీ జనం ముందు ఉంచింది. ఇప్పుడు కేసు ఆ దిశగానే ముందుకు వెళ్తున్నట్టు కనిపిస్తోంది. గత నెల 18న సిద్దిపేట కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీష్ రావు పాత్రపై వివరాలు పోలీసులకు అందించారు. గతంలో ఓసారి డీజీపీకి, జూబ్లీహిల్స్ ఏసీపీని కలిసి ఈయన ఫిర్యాదు చేశారు. దానికి సంబంధించి తర్వాత వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తన ఫోన్‌ను హరీష్ రావు ట్యాప్ చేసినట్టు పేర్కొన్నారు చక్రధర్ గౌడ్. ఆయన ఇచ్చిన ఆధారాలను స్వీకరించిన పోలీసులు విచారణ మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే హరీష్‌పై పంజాగుట్ట పీఎస్‌లో కేస్ను÷ల్ అయింది. తనపై అక్రమ కేసులు పెట్టి వేధించారని చక్రధర్ గౌడ్ కీలక విషయాలను పోలీసులకు వివరించినట్టు తెలుస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సిద్దిపేటలో వార్ రూం ఏర్పాటు చేశారు ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, భుజంగ రావు. తర్వాత తన ఫోన్ ట్యాప్ చేశారని అంటున్నారు చక్రధర్ గౌడ్. హరీష్ రావు దగ్గరుండి ఇదంతా చేయించారని ఆరోపించారు. ఆయనకు రాజకీయంగా అడ్డు వస్తున్నానని కక్షగట్టి ఇలా చేశారని, ఆయన్ను జైల్లో వేయాలని కోరారు. 2023 నుండి ఇప్పటిదాకా ఫోన్ ట్యాపింగ్ పైన కొట్లాడుతున్నానని, గతంలో డీజీపీకి వినతిపత్రం ఇచ్చానని చెప్పారు. న్యాయం జరగకపోవడంతో కోర్టుకు వెళ్లానన్నారు. తన ఇంట్లో 20 ఫోన్లు ట్యాప్ అయ్యాయని, రాధాకిషన్ రావు చంపుతా అని బెదిరించాడని తెలిపారు. తన మీద అత్యాచారం కేసు, ఉద్యోగాల మోసం కేసులు పెట్టించి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని వాపోయారు. హరీష్ రావు ఎన్నో కుటుంబాలను, వ్యాపారస్తులను లొంగదీసుకున్నారని, తన మీద 6 కేసులు పెట్టించారని ఆరోపించారు చక్రధర్ గౌడ్. అనేక ఇబ్బందులు పెట్టి బీఆర్ఎస్ పార్టీలోకి రమ్మని ఒత్తిడి చేశారని అన్నారు. హరీష్ రావుతో తనకు ప్రాణహాని ఉందని డీజీపీకి విన్నవించుకున్నానని, ఆయనే ఫోన్ ట్యాపింగ్ సూత్రధారి అని చెప్పారు. ÷ఖఆర్ఎస్ హయాంలో అప్పటి ప్రతిపక్ష నాయకుల ఫోన్లను విచ్చలవిడిగా ట్యాప్ చేశారని,కేటీఆర్, హరీష్ రావు సూచనల మేరకు ఫోన్ ట్యాపింగ్ జరిగిందనేది కాంగ్రెస్ నేతల వాదన. అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని, నిఘా వ్యవస్థ, పోలీస్ వ్యవస్థను ఎలా తప్పుదారిన వాడుకున్నారో ఇదే నిదర్శనమని విమర్శించారు. వ్యక్తిగత అవసరాల కోసం ప్రభుత్వ వ్యవస్థను ఉపయోగించడమే కాకుండా ప్రత్యేక పరికరాలు తెప్పించి ట్యాపింగ్‌కు పాల్పడ్డారని పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇప్పుడు తాజాగా హరీష్ రావుపై కేసు నమోదు కావడంతో ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ నెలకొంది. కానీ, ఆయన మాత్రం ఇది అక్రమ కేసుగా కొట్టిపారేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహిస్తూ ఆయనే ఓ ఫ్యాక్షనిస్టులా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఎవరేమన్నా చట్టం తన పని తాను చేసుకుపోతుంది.

# కార్పొరేటర్ నుంచి ముఖ్యమంత్రి వరకు

ముంబై:మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడణవీస్ ఆయనకు ఈ పదవి ఊరకే దక్కలేదు. నాలుగు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత, రాష్ట్రంలో బీజేపీని అతిపెద్ద పార్టీగా నిలబెట్టడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఫడణవీస్ దాదాపు 30 ఏళ్లుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఆయన కుటుంబానికి ఆర్ఎస్ఎస్ తో అనుబంధంతో పాటు, రాజకీయ నేపథ్యముంది. తండ్రి గంగాధర్ ఫడణవీస్ బీజేపీ కీలక నేతల్లో ఒకరు. ఆయన చాలా ఏళ్లపాటు ఎమ్మెల్యేగా కొనసాగారు. విద్యార్థి దశలో ఏబీవీపీ నేతగా ఎదిగారు. గడ్కరీ అడుగుజాడల్లో నడుస్తూ, ఆ తర్వాత కొద్దికాలానికే రాజకీయాల్లో క్రియాశీలకంగా మారారు. 1992లో, 22 ఏళ్లకే కార్పొరేటర్‌గా నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అడుగుపెట్టారు. అలా ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. ఇతర రాజకీయ నాయకులతో పోలిస్తే ఆయన సులువుగానే రాజకీయాల్లోకి వచ్చారని చెప్పవచ్చు. 1992లో తొలిసారి కార్పొరేటర్ అయ్యారు, నిజానికి ఆ ఎన్నికలు 1989లో జరగాల్సి ఉంది. అప్పటికి ఆయనకు వయసు సరిపోదు, కానీ అదృష్టవశాత్తూ ఆ ఎన్నికలు వాయిదాలు పడడంతో చిన్నవయసులోనే కార్పొరేటర్ అయ్యారు. ఆ తర్వాత, చిన్నవయసులోనే నాగ్‌పూర్ మేయర్ అయ్యారు. అనంతరం, శివసేన – బీజేపీ తొలి సంకీర్ణ ప్రభుత్వం కూలిపోవడంతో జరిగిన 1999 ఎన్నికల్లో గెలిచి మొదటిసారి శాసన సభలో అడుగుపెట్టారు. ఫడణవీస్ రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్లలో నాగ్‌పూర్, విదర్భ ప్రాంతాల్లో నితిన్ గడ్కరీ హవా నడిచేది. ఫడణవీస్ ఆయన అడుగుజాడల్లోనే రాజకీయంగా తొలి అడుగులు వేశారు. ఆ తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో గడ్కరీని వీడి, ఆయన ప్రత్యర్థి గోపీనాథ్ ముండే వర్గానికి దగ్గరయ్యారు. అలా, 2013లో బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని దక్కించుకోగలిగారు. దేవేంద్ర ఫడణవీస్‌ను ఆర్ఎస్ఎస్‌లో కీలక సభ్యుడిగానూ, అధిష్టానానికి విధేయుడిగానూ చెబుతారు. అది ఆయనకు మేలు చేసింది. మరో విషయమేంటంటే, 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత మోదీ – షా సారథ్యంలోని బీజేపీ నితిన్ గడ్కరీకి అంత అనుకూలంగా లేదని



చెబుతుంటారు. అదే సమయంలో, రాష్టాల్లో్ మెజారిటీ వర్గానికి చెందిన నాయకుడిని కాకుండా, మైనారిటీ వర్గానికి చెందిన నాయకుడిని ముఖ్యమంత్రిని చేసే వ్యూహాన్ని బీజేపీ అమలు చేసింది. అలా మరాఠాయేతరుడైన దేవేంద్ర ఫడణవీస్‌కు మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవి దక్కింది. ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో ఫడణవీస్ మహారాష్ట్రలో అధికార కేంద్రంగా ఎదిగారు. మోదీ అడుగుజాడల్లో నడుస్తూ, ఒకవైపు అభివృద్ధి ఇమేజ్, మరోవైపు పార్టీలో తన ప్రత్యర్థులను తగ్గించుకోవడం వంటి వ్యూహాలను అమలు చేశారు. నిజానికి, సొంత పార్టీలోని ప్రత్యర్థులనే ఫడణవీస్‌కు పెద్దసవాల్ అంటారు విశ్లేషకులు. నితిన్ గడ్కరీ, ఏక్‌నాథ్ ఖడ్సే, పంకజ ముండే, వినోద్ తావ్డే, చంద్రకాంత్ పాటిల్‌లను ఆయనకు ప్రత్యర్థులుగా భావిస్తారు. వీరిలో నితిన్ గడ్కరీ కేంద్ర మంత్రిగా జాతీయ రాజకీయాల్లోకి వెళ్లాల్సి రావడంతో రాష్ట్ర రాజకీయాల్లో జోక్యం తగ్గిపోయింది. ఇతర ప్రత్యర్థుల దారులు కూడా మూసుకుపోవడంతో ఫడణవీస్‌కు దాదాపు అడ్డంకులు తొలగాయి. మంత్రులుగా ఉన్న ఏక్‌నాథ్ ఖడ్సే, పంకజ ముండే, వినోద్ తావ్డేలు వరుస వివాదాలతో ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. దాంతో ఇప్పుడు మహారాష్ట్ర బీజేపీలో తిరుగులేని నేతగా కొనసాగుతున్నారు.

# ఇస్రో రాకెట్ ప్రయోగం సూపర్ సక్సెస్



శ్రీహరికోట, పీఎస్ఎల్‌వి సి–59 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరి కోట నుంచి ఇస్రో చేసిన ఈ రాకెట్ ప్రయోగం సూపర్ సక్సెస్ అయ్యింది. ప్రోబా–3 ఉపగ్రహాలను కక్ష్యలోకి విజయవంతంగా పంపింది. ఈ ప్రోబా–3ని యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ రూపొందించింది. సూర్యుడిపై పరిశోధలనకు గానూ ఈ ప్రోబా–3 ఉపయోగపడనుంది. ఈ ఉపగ్రహాలు సూర్యకిరణాలపై మరింత డెప్త్‌గా అధ్యయనం చేయనున్నాయి. కరోనా పరిశీలనలో ఇబ్బందులను అధిగమించేలా ఈ ఉపగ్రహాలను రూపొందించారు శాస్త్రవేత్తలు. ప్రోబా–3 శాటిలైట్లతో%ొ%ఇక సూర్యుడి సీక్రెట్స్ తెలిసిపోనున్నాయివాస్తవానికి డిసెంబర్ 4 సాయంత్రం 4:08 గంటలకు ప్రయోగించాల్సిన పీఎస్ఎల్వీ సీ–59 రాకెట్ ప్రయోగం వాయిదా పడింది. నిన్న మధ్యాహ్నం 2:38 నిమిషాలకు శ్రీహరికోట సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్‌లో దీనికి కౌంట్ డౌన్ మొదలైంది. ఇంతలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ ప్రయోగాన్ని ఆ మర్నాటికి వాయిదా వేశారు. తిరిగి డిసెంబర్5న సాయంత్రం 4:12 గంటలకు ఇస్రో ఈ రాకెట్‌ను ప్రయోగించింది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ.. ప్రోబా–3ని రూపొందించింది. ఈ మిషన్ ద్వారా రెండు ఉపగ్రహాలను నింగిలోకి పంపించారు. వీటిని ఒకే కక్ష్యలో ఏర్పాటు చేశారు. ఇది భూమి నుంచి 60 వేల కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాపై కీలక పరిశోధనలు జరపనున్నారు. దీనిపై నిఘా పెట్టడం ద్వారా ఎప్పటికప్పుడు అప్ డేట్స్ తెలుసుకోనున్నారు. ఈ రెండు ఉపగ్రహాలు పరస్పర సమన్వయంతో ఒకే భూ కక్ష్యలో పయనిస్తుంటాయి. ప్రోబా–3 మిషన్‌లో ప్రయోగించిన ఉపగ్రహాలు కృత్రిమ సూర్యగ్రహణ పరిస్థితులను సృష్టిస్తాయి. తద్వారా సూర్యుడి బయటి పొర అంటే.. కరోనాను అధ్యయనం చేస్తాయి. ఈ జంట ఉపగ్రహాల్లో ఒక దాంట్లో కరోనాగ్రాఫ్ ఉంటుంది. మరొకటి ఆల్టరర్ కలిగి ఉంటుంది. ఈ ఉపగ్రహాలలో ఒకటి సూర్యుడిని కనిపించకుండా కృత్రిమ గ్రహణం పరిస్థితి సృష్టిస్తే.. మరొకటి కరోనాను నిశితంగా గమనిస్తూ వస్తుంది. ప్రోబా–3 మిషన్ స్పెయిన్, పోలాండ్, బెల్జియం, ఇటలీ, స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తల కృషి ఫలితం. మిషన్‌లో రెండు ఉపగ్రహాలను ఒకేసారి ప్రయోగించారు. ఈ ఉపగ్రహాలు నిర్ణీత కక్ష్యలోకి చేరుకోవడం కీలకం. ఎందుకంటే ఒకదానితో మరొకటి సమన్వయం చేసుకుంటూ కరోనాపై అధ్యయనం చేస్తాయి. ఇందులో ఏ ఒక్కటి పని చేయకపోయినా రెండో శాటిలైట్‌కు ఉపయోగం లేకుండాపోతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

## భారత్, చైనా మధ్య దౌత్యచర్చలు..

న్యూఢిల్లీ, సరిహద్దులో శాంతియుత పరిస్థితులు కొనసాగేలా చూడడమే ప్రధాన అజెండాగా భారత్?, చైనా దౌత్య చర్చలు జరిపాయి. ఇప్పటికే ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాలకు అనుగుణంగా సరిహద్దు నియంత్రణ చర్యలు కొనసాగించాలని తీర్మానించాయి. గల్వాన్? ఘర్షణల నేపథ్యంలో ఇటీవల కుదిరిన బలగాల ఉపసంహరణ ఒడంబడిక అమలుపై రెండు దేశాలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయి. దిల్లీలో జరిగిన చర్చల అనంతరం భారత విదేశాంగ శాఖ ఈ విషయం వెల్లడించింది. 2020లో జరిగిన ఘర్షణలు, ఆ తర్వాత తలెత్తిన పరిణామాలపై భారత్?, చైనా ప్రతినిధులు చర్చించారు. ప్రస్తుతం రెండు దేశాల సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులపై సమీక్షించారు. శాంతియుత వాతావరణం కొనసాగాలే చూడడమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని తీర్మానించారు. ఈ చర్చలకు కొనసాగింపుగా భారత్?, చైనా ప్రత్యేక ప్రతినిధులు త్వరలోనే భేటీ కావాలని నిర్ణయించినట్లు విదేశాంగ శాఖ గురువారం వెల్లడించింది.

# సభా సమరం.. ఈసారి కేసీఆర్ హాజరా? గైర్హాజరా?!



హైదరాబాద్,తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయని గవర్నర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సమావేశాలలో పలు అంశాలు చర్చించనున్నట్లు తెలుస్తోంది. అయితే, అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారనేది ఈ నెల 9న జరిగే బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. సంక్రాంతి తరువాత రైతు భరోసా నిధులు వేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అందుకు సంబంధించిన విధి విధానాల రూపకల్పనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే పలు అంశాలతో కూడిన నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశాలను అసెంబ్లీలో చర్చించి అర్హులైన రైతులకే రైతు భరోసా దక్కేవిధంగా ముందుకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోంది. మరోవైపు కొత్తగా తీసుకురానున్న ఆర్వోఆర్ చట్టంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న కులగణన సర్వే గణాంకాలను అసెంబ్లీలో పెట్టి చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయ్యింది. ఈ సంవత్సరకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నేతలు పదేపదే విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలపై గళమెత్తేందుకు బీఆర్ఎస్ రెడీ అవుతోంది. దీంతో అసెంబ్లీ శీతాకాల సమావేశాలు హాట్ హాట్ గా జరిగే అవకాశాలున్నాయి. అయితే ప్రతిపక్షంగా బీఆర్ఎస్ తరపున నేతలు సభలో ఎంత గట్టిగా గళమెత్తినా, కేసీఆర్ సభకు గైర్హాజరైతే మాత్రం సభలో కాంగ్రెస్ దే పై చేయి కావడం ఖాయమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరిన ఈ ఏడాది కాలంలో ఇప్పటి వరకూ రెండు సార్లు అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. ఆ రెండు సందర్భాలలోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో వాదోపవాదనలు జరిగాయి. అయితే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభలో లేకపోవటంతో కాంగ్రెస్ ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. బీఆర్ఎస్ తరపున కేటీఆర్, హరీశ్ రావు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నాలు చేసినా కాంగ్రెస్ సభ్యులు దీటుగా సమాధానం ఇచ్చారు. కేసీఆర్ సభలో ఉండిఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్న భావన గత రెండు సందర్భాలలోనూ బీఆర్ఎస్ శ్రేణులలో వ్యక్తం అయ్యింది. కేసీఆర్ మాత్రం ఒక్కరోజు మినహా అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన ఒక్కరోజు మాత్రమే అసెంబ్లీకి కేసీఆర్ హాజరయ్యారు. ఆరోజు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల బడ్జెట్ కాదని, అవసరమైన పథకాలకు, ప్రాజెక్టులకు బడ్జెట్ లో నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఇక నుంచి అసెంబ్లీకి వస్తా కాంగ్రెస్ ప్రభుత్వం అంతుచూస్తానంటూ కేసీఆర్ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఇక నుంచి అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులకు కేసీఆర్ చుక్కలు చూపించడం ఖాయమని.. రేవంత్ ఇక కాస్కో అంటూ.. బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా అప్పట్లో పోస్టులు పెట్టాయి. అయితే, కేసీఆర్ మాత్రం అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాలేదు. దీంతో బీఆర్ ఎస్ శ్రేణులు తీవ్రస్థాయిలో నిరాశకు గురయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై అనేక అవినీతి, అక్రమాలకు సంబంధించి ఆరోపణలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ , కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి , విద్యుత్ కొనుగోళ్ల విషయంలో అవినీతికి జరిగిందంటూ ఆరోపణలు చేశారు. ఈ అంశాలపై విచారణకు సైతం ఆదేశించారు. అయినా కేసీఆర్ మాత్రం మౌనం వీడలేదు. అధికారం కోల్పోయిన నాటినుంచి ఆయన కేవలం ఫాంహౌస్‌కే పరిమితం అవుతున్నారు. అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్ష నేత కేసీఆర్ రావాలని అనేక సార్లు సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. అయితే గతంలో కొందరు బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ సమావేశాలకు రావాలని కేసీఆర్ వద్ద ప్రస్తావించగా.. ప్రభుత్వానికి కొంత సమయం ఇద్దామని, సంవత్సర కాలం సమయం ఇచ్చిన తరువాత ప్రభుత్వం పనితీరు, విధానాలపై ప్రశ్నిద్దామని చెప్పినట్లు తెలిసింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తయ్యింది. అంటే కేసీఆర్ చెప్పిన గడువు ముగిసింది. దీంతో ఈనెల 9నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారా.. లేదా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. బీఆర్ఎస్ వర్గాలు అయితే కేసీఆర్ సభకు హాజరౌతారనీ, ప్రభుత్వ వైఫల్యాలను అసెంబ్లీ వేదికగా ఎండగడతారనీ ఆశాభావంతో ఉన్నాయి. అన్నిటికీ మించి ఈనెల 9 నుంచి జరిగే అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఎంతో ముఖ్యమైనవి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయ్యింది. ఈ నేపథ్యంలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో అధికార పార్టీని నిలదీసేందుకు ప్రతిపక్షానికి మంచి అవకాశమని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, పెన్షన్ల తొలగింపు, మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్ల తొలగింపు తదితర అంశాలపై రేవంత్ సర్కార్ ను నిలదీయడానికి, ఇరుకున పెట్టడానికి ఇదో మంచి అవకాశంగా బీఆర్ఎస్ భావిస్తోంది. అయితే అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ను ఇరుకున పెట్టి పై చేయి సాధించాలంటే పార్టీ అధినేత కేసీఆర్ సభకు వచ్చి గళం విప్పాల్సి ఉంటుందనీ, ఆయన గైర్హాజరైతే మాత్రం విపక్షంగా బీఆర్ఎస్ వైఫల్యాన్ని అంగీకరించినట్లే అవుతుందనీ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రేవంత్ రెడ్డి డిమాండ్ మేరకు, బీఆర్ఎస్ శ్రేణుల విజ్ఞప్తుల మేరకు కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు వస్తారా.. లేకుంటే ఈసారికూడా దుమ్మా కొడతారా అనే అంశంపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతున్నది.


# రైతు భరోసా కేంద్రాల్లో అవకతవకలపై ప్రభుత్వం సీరియస్...



అమరావతి, కృష్ణా జిల్లాలో రైతు భరోసా కేంద్రాల్లో అవకతవకలపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ ఘటనలో ఇద్దరు అధికారులు కస్టోడియల్ ఆఫీసర్, టీఎలను సస్పెండ్ చేసింది. లారీల్లో ఎక్కువ బస్తాలు ధాన్యం లోడ్ చేస్తూ..., రికార్డులలో మాత్రం తక్కువ చూపిస్తున్న వైనంపై బుధవారం మీడియా ప్రతినిధులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ముఖ్యమంత్రి ఈ అవకతవకల ఘటనపై ఆధారాలను స్వయంగా పరిశీలించారు. రైతుల నుంచి ఎక్కువ ధాన్యం సేకరించి..., రికార్డుల్లో మాత్రం తక్కువ చూపిస్తూ... అధికారులు – మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారంటూ రైతుల నుంచి ఆరోపణలు వచ్చాయి. రైతుల ఫిర్యాదులపై గత రాత్రి సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని హెచ్చరించారు. రైతుల నుండి నిరంతరంగా ధాన్యం కొనుగోలు జరగాలని ఆదేశించారు. పౌరసరఫరాల, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసి ధాన్యం కొనుగోలుపై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. రైతు భరోసా అవకతవకలు ఆధారాలను మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. శాఖపర చర్యలకు ఆదేశించారు. కస్టోడియల్ ఆఫీసర్, టీఎలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ప్రభుత్వ చర్యలతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఫిర్యాదు చేసిన రైతులకు ఎమ్మార్వోల నుంచి ఫోన్లు వెళ్లాయి. వ్యక్తిగతంగా కలిసి సమస్య పరిష్కరించుకోవాలంటూ కొందరు రైతులకు ఎమ్మార్వో ఫోన్ చేశారు. కాగా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండీ మన్‌జీర్ జిలానీ అమూన్ ఆదేశాల మేరకు అధికారులు రైసు మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులు, లీగల్ మెట్రాలజీ, పోలీసు సిబ్బందితో ఏర్పాటు చేసిన 5 ప్రత్యేక బృందాలు బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కృష్ణా జిల్లాలోని రైసు మిల్లుల్లో తనిఖీలు నిర్వహించాయి. ధాన్యం తూకాల్లో కోతలు విధిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖరీఫ్ ముగిసేవరకు ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని సివిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు. కాగా 'దళారులకు ధాన్యాన్ని విక్రయించుకోవద్దు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు నమోదు చేసుకోండి. మద్దతు ధరను ఇచ్చి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుంది. 12 గంటల్లో ఖాతాల్లో నగదు జమ చేస్తుంది.' అని రైతులకు పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. అవనిగడ్డ నియోజకవర్గంలో తుఫాను కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులు, ధాన్యం కొనుగోళ్లలో సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన ఆయనకు మాజేరు వద్ద ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జనసేన, టీడీపీ నేతలు స్వాగతం పలికారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల పరిధిలోని పాతమాజేరు, లంకపల్లి, లక్ష్మీపురం, మంగళాపురం అడ్డరోడ్డు, చల్లపల్లి–పెదకళ్లేపల్లి రోడ్డు, కాసానగర్, పెదప్రోలు ప్రాంతాల్లో హైవేపై దారి పొడవునా ఆరబెట్టిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. రైతులున్న ప్రతిచోటా వాహనం దిగి సమస్యలు తెలుసుకున్నారు. వర్షానికి ధాన్యం తడవడం, కొద్దిమేర మొలకెత్తటం, తేమశాతం ఎక్కువగా ఉండటంతో ఆరబెట్టుకుంటున్నామని, తేమశాతం ఎక్కువగా ఉండటంతో మిల్లర్లు ధాన్యం తీసుకోవడం లేదని, తీసుకున్నా తక్కువ ధర ఇస్తున్నారని రైతులు మంత్రికి తెలిపారు. 1262, 1224 రకం ధాన్యం కొనుగోలు చేయటంలేదని ఫిర్యాదు చేశారు. ప్రతి గింజా ప్రభుత్వ మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని, దళారులను ప్రోత్సహించవద్దని, సమస్యలుంటే రైతుసేవా కేంద్రానికి వెళ్లాలని రైతులకు మంత్రి సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని సాయంత్రంలోగా కొనుగోలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. తేమ 24శాతం వరకూ కొనుగోలు చేయాలని ఆదేశించామన్నారు. 1262 రకం కొనుగోలుపై ఇప్పటికే మాట్లాడామని, 1224 రకం కొనుగోలులోనూ ఇబ్బందులు లేకుండా చూస్తామని, రైతులు అధైర్యపడాల్సిన పనిలేదని ఆయన భరోసా ఇచ్చారు. మిల్లర్లు, అధికారులతో ఇబ్బందులుంటే ఆర్డీవో దృష్టికి తేవాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగులు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

# రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు..

హైదరాబాద్,జీహెచ్ఎంసీ పరిధిలో హెచ్–సిటీ రోడ్ల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. ఆరు జోన్లలో 5 ప్యాకేజీల్లో చేపట్టే పనులకు రూ.5,942 కోట్ల నిధులు మంజూరయ్యాయి.ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే టెండర్లు పిలిచి ఈ నిధులతో పనులు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఇదిలా ఉండగా ఇందులో అత్యధికంగా సికింద్రాబాద్ జోన్ లోని ఏఓసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణానికి రూ.940 కోట్లు విడుదల చేసింది. శేరిలింగంపల్లి జోన్లో ఖాజాగూడ, ఐఐటీ జంక్షన్, విప్రో జంక్షన్‌ల అభివృద్ధికి రూ.837 కోట్లు విడులయ్యాయి.ఇక మియాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి ఆల్విన్ ఎక్స్ రోడ్డు వరకు ఆరు లేన్ల ఫ్లైఓవర్, లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వైపు మూడు లేన్ల అండర్‌పాస్‌ల నిర్మాణానికి రూ.530 కోట్లు విడుదల చేసింది. ఎల్బీనగర్ జోన్లో టీకేఆర్ కళాశాల జంక్షన్ నుంచి మందమాలమ్మ చౌరస్తా వరకు ఆరు



లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.416 కోట్లు, ఖైరతాబాద్ జోన్లో జంక్షన్ పరిధిలో రైతిబౌలి నుంచి నానల్‌నగర్ వరకు మల్టీ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.398 కోట్లు విడుదల చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com